## రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక


కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ రంజిత్‌బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

జైరాజ్ ఇస్పాత్ స్టీల్ పరిశ్రమ




# పరుగులు తీస్తున్న పారిశ్రామికం



రాష్ట్ర విభజన తరువాత ఆనాటి టీడీపీ ప్రభుత్వం కర్నూలును పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి ప్రయత్నించింది. ఉమ్మడి జిల్లా నుంచి ఇద్దరే ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ సీఎం చంద్రబాబు నిర్లక్ష్యం చేయలేదు. ఓర్వకల్లును పారిశ్రామిక హబ్‌గా ప్రకటించి ప్రపంచంలోనే అతి పెద్ద వెయ్యి మెగావాట్ల సోలార్ పవర్ యూనిట్, పంప్డ్ స్టోరేజీ పవర్ యూనిట్లు ఏర్పాటు చేశారు. కొలిమిగుండ్ల కేంద్రంగా సిమెంట్ హబ్‌గా ప్రకటించి.. పలు సిమెంట్ పరిశ్రమల ఏర్పాటుకు ప్రయత్నించారు. అంతర్జాతీయ గుర్తింపు పొందిన అయోవా విశ్వవిద్యాలయం సాంకేతిక సహకారంతో నందికొట్కూరులో మెగా సీడ్ పార్కు ఏర్పాటుకు శ్రీకారం చట్టారు. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వ హయాంలో పారిశ్రామిక ప్రగతి పడకేసింది. చంద్రబాబు భూమి పూజ చేసిన ఒకటి రెండు పరిశ్రమలు పురుడుపోసుకున్నాయే తప్ప.. ఒక్క కొత్త పరిశ్రమను కూడా జగన్ ప్రభుత్వంలో తీసుకురాలేపోయింది. 2024 జూన్ 12న మళ్లీ సీఎం చంద్రబాబు సారథ్యంలో టీడీపీ కూటమి ప్రభుత్వం కొలువుదీరడం.. జిల్లాకు చెందిన టీజీ భరత్ పరిశ్రమల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో పారిశ్రామిక ప్రగతి వేగం పుంజుకుంది. 2024 సంవత్సరంలో ఆరు నెలలు వైసీపీ పాలన.. ఆరు నెలలు టీడీపీ కూటమి ప్రభుత్వంలో సాధించిన పారిశ్రామిక పురోగతిని విశ్లేషిస్తే..

- ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్‌కు కేంద్రం ఆమోదం
- తొలి దశలో 2,612 ఎకరాల్లో రూ.2,786 కోట్లతో అభివృద్ధి
- జపాన్ సంస్థ సెమీ కండక్టర్ పరిశ్రమ ఏర్పాటుకు సన్నాహాలు
- వైసీపీ హయాంలో పారిశ్రామిక పురోగతి కుదేలు
- 2024లో చంద్రబాబు వచ్చాక పురోగతి
- పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ వల్ల మరింత కలిసొచ్చే అవకాశం

కర్నూలు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 2014-19 మధ్య ఆనాటి సీఎం చంద్రబాబు పారిశ్రామిక ప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించారు. రాయలసీమలో వెంటాడే కరువు, వలసలు నివారించాలంటే పరిశ్రమలు తీసుకొచ్చి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగుపరచాలనే ఏకైక లక్ష్యంతో 33 వేల ఎకరాల్లో ఓర్వకల్లు పారిశ్రామిక హబ్‌గా ఏర్పాటు చేశారు. కొలిమిగుండ్ల కేంద్రంగా సిమెంట్ హబ్, నందికొట్కూరు కేంద్రంగా మెగా సీడ్ హబ్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఆసియాలోనే అదిపెద్ద వెయ్యి మెగా వాట్ల సోలార్ యూనిట్ ఏర్పాటు చేశారు. జైరాజ్ ఇస్పాత్ స్టీల్ పరిశ్రమకు శంకుస్థాపన చేశారు. ప్రపంచంలోనే తొలి పంప్డ్ స్టోరేజ్ పవర్ ఉత్పత్తి యూనిట్ 3,500 మెగావాట్లతో నాంది పలికారు. వివిధ రంగాల ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఇక్కడ పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపాలంటే విమాన రవాణా సౌకర్యం ఎంతో కీలకమని గుర్తించి చంద్రబాబు 1,010 ఎకరాల విస్తీర్ణంలో కొండలను పిండి చేసి రూ.110 కోట్లతో కర్నూలు (ఓర్వకల్లు) విమానాశ్రయం నిర్మించారు. నీటి వసతి కోసం ముచ్చుమర్రి లిఫ్ట్ నుంచి 4 టీఎంసీలు ఎత్తిపోసి నిల్వ చేసేందుకు జలాశయం నిర్మాణం, కర్నూలు రైల్వే స్టేషన్ సమీపంలోని దూపాడు రైల్వే స్టేషన్ నుంచి ప్రత్యేక రైల్వేలైన్ నిర్మాణ ప్రతిపాదనలు సిద్ధం చేశారు. నందికొట్కూరు దగ్గర మెగా సీడ్ హబ్, జైన్ ఇరిగేషన్ ప్లాంట్‌కు శ్రీకారం చుట్టారు. 2019లో వైసీపీ అధికారంలోకి రావడం, జగన్ ప్రభుత్వంలో ఐదేళ్ల నిర్లక్ష్యం కారణంగా పారిశ్రామిక ప్రగతి కలలు కల్లలుగా మారాయి. మళ్లీ సీఎం చంద్రబాబు సారథ్యంలో మళ్లీ టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం రావడం, చంద్రబాబు విజన్‌కు ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహకారం తోడుకావడంతో పారిశ్రామిక అభివృద్ధి ఆశలు చిగురిస్తున్నాయి. 2024 ఉమ్మడి కర్నూలులో పారిశ్రామిక పురోగతికి వేదిక అయ్యింది.

### 2,612 ఎకరాలు.. రూ.2,786 కోట్లు


జైరాజ్ స్టీల్ ప్లాంట్ వద్ద మంత్రి టీజీ భరత్ (ఫైల్)

ఓర్వకల్లు ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ 2,612 ఎకరాల్లో రూ.2,786 కోట్లతో అభివృద్ధి చేస్తామని ఈ ఏడాది జూన్ 23న కేంద్రం ప్రకటించడం జిల్లా నిరుద్యోగ యువతలో మరవలేని గుర్తింపును 2024 సొంతం చేసుకుంది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన కేంద్ర బడ్జెట్-2024-25లో ఓర్వకల్లు పారిశ్రామిక నోడ్ అభివృద్ధి చేస్తామని కీలక ప్రకటన చేశారు. నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎన్ఐసీడీపీ)లో భాగంగా ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీల అభివృద్ధికి కేంద్రం ఆమోదం తెలిపింది. ఫేజ్-1 కింద 2,612 ఎకరాల్లో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలో రూ.2,786 కోట్లతో మౌలిక వసతులు కల్పించనున్నారు. నాన్ మెటలిక్ మినరల్ పరిశ్రమలు, ఆటోమొబైల్ రంగం విడిభాగాలు తయారీ, పునరుత్పాధక పరిశ్రమలు, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ పరికరాలు, ఏరోస్పెస్ అండ్ డిఫెన్స్ హార్డ్‌వేర్, ఫార్మాస్యూటికల్స్, వజ్రాలు, బంగారు అభరణాల తయారీ, వస్త్ర ఉత్పత్తి రంగ పరిశ్రమలు ఇక్కడే ఏర్పాటు చేసేందుకు నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఐసీడీసీ) ప్రత్యేక దృష్టిని పెట్టిందని, ఆయా పరిశ్రమలు ఏర్పాటు ద్వారా రూ.12 వేల కోట్లు పెట్టుబడులు, 45,071 మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా వేశారు.

మిగతా 6లో..

## జనవరి నుంచి ఆన్‌లైన్ సేవలు

- ముమ్మర ప్రయత్నాలు చేస్తున్న డీసీసీబీ అధికారులు
- పెండింగ్ పనుల పూర్తి చేయాలని ఆదేశాలు


కంప్యూటరీకరణను పరిశీలిస్తున్న జీఎం రామాంజనేయులు

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని అన్నదాతలకు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో జనవరి నుంచి ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తీసుకురావడానికి ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నాయి. పెండింగ్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయడం కోసం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లోని సీఈవోలు, సిబ్బంది, పర్సన్ ఇన్‌చార్జిలు పూర్తి స్థాయిలో పనులు చేయాలని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సీఈవో విజయకుమార్, జీఎం రామాంజనేయులు ఆదేశాలు జారీ చేశారు. పనులు ఈ నెలాఖరులోపు పూర్తయితే.. రైతులకు రుణాల మంజూరు, బకాయిల చెల్లింపు తదితర కార్యకలాపాలన్నింటిలో రైతులకు శ్రమ తప్పనుంది. ప్రతి విషయంలోనూ పారదర్శకత చోటు చేసుకోవడం వల్ల అక్రమాలకు తెరపడనుంది. గతంలో మాదిరిగా రాజకీయ నాయకుల ప్రమేయం కూడా చాలా వరకు తగ్గిపోనుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 99 సంఘాల్లో ఒకటిన్నర లక్ష మంది రైతులు రుణాలు తీసుకుంటున్నారు. వీరందరినీ ఆయా సంఘాల్లో సభ్యత్వం తీసుకున్న వారి నుంచి ఈకేవైసీ పూర్తి చేయించేందుకు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల సీఈవోలకు ఆదేశాలు ఇచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఈకేవైసీ నమోదు ప్రక్రియలో ఉమ్మడి కర్నూలు జిల్లా 12వ స్థానంలో ఉంది. ఈ తేడాను భారీగా తగ్గించడానికి సీఈవో విజయకుమార్, జనరల్ మేనేజర్ రామాంజనేయులు, ఆయా సంఘాల్లో సుడిగాలి పర్యటన చేస్తున్నారు. ఇటీవల కల్లూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో 20 గ్రామాల్లో ఉన్న దాదాపు 6వేల మంది రైతులందరూ ఈకేవైసీ చేయించుకునేలా సీఈవో పుల్లయ్యతో పాటు సిబ్బంది కార్యాచరణతో ముందుకు వెళ్లేలా జీఎం రామాంజనేయులు ఆ సంఘం కార్యాలయంలో పలు సూచనలు అందజేశారు.

## అభివృద్ధిని అడ్డుకుంటే ప్రజలే తరిమేస్తారు

### వైసీపీపై 'కుడా' చైర్మన్ సోమిశెట్టి ఆగ్రహం



కర్నూలు అర్బన్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): అభివృద్ధిని అడ్డుకుంటే వైసీపీని ప్రజలే తరిమేస్తారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, 'కుడా' చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు ధ్వజమెత్తారు. కర్నూలులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎంగా గత ఐదేళ్లలో వనరులను దోచుకున్న వైఎస్ జగన్‌ను ప్రజలు తిరస్కరించినా సిగ్గు లేకుండా పోయిందని మండిపడ్డారు. పేదలకు అందించే బియ్యాన్ని దోచుకుతిన్న మీరు.. విద్యుత్ చార్జీలు పెంచారంటూ రోడ్ల మీదకు వచ్చి దౌర్జన్యాలు, దాడులు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గతంలో వైసీపీ ప్రభుత్వంలోనే విద్యుత్ చార్జీలను పెంచారని, అయితే ప్రస్తుతం నిరసనలు చేయడం సిగ్గుచేటని అన్నారు. గత ఐదేళ్లలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన వైసీపీకి ఆందోళనలు చేసే అర్హత ఉందా? అని ప్రశ్నించారు. కడప జిల్లాలో అధికారిపై దాడికి పాల్పడం సిగ్గుచేటన్నారు. అధికారులపై దాడులకు పాల్పడితే చర్యలు తప్పవని అన్నారు. కూటమి ప్రభుత్వంలో అమరావతి, పోలవరంతో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తుంటే వైసీపీ నాయకులు ఓర్వలేకపోతున్నారన్నారు. జగన్ ఆదేశాలతో అధికారులను బెదిరించడం, దాడులు చేయడం ఎంతవరకు సమంజసమని వైసీపీ నాయకులను ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో రాష్ట్రం నుంచి వెళ్లిపోయిన పరిశ్రమలను తిరిగి రాబట్టడానికి సీఎం చంద్రబాబు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా మార్చడానికి కేంద్ర ప్రభుత్వంతో కలిసి ముందుకెళ్తున్నారని అన్నారు. ప్రజలను రెచ్చగొట్టాలని చూస్తే వారే వైసీపీకి తగిన గుణపాఠం చెబుతారని అన్నారు.

## దళారుల మాటలు నమ్మి మోసపోకండి

- పారదర్శకంగా రిక్రూట్‌మెంటు ● ఎస్పీ బిందుమాధవ్



కర్నూలు క్రైం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పోలీసు ఉద్యోగాల నియామక విషయంలో దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని ఎస్పీ జి.బిందుమాధవ్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు పోలీసు కానిస్టేబుళ్ల ఈవెంట్లు జరుగుతాయని చెప్పారు. దేహదారుఢ్య పరీక్షలకు ఉమ్మడి జిల్లాలో మొత్తం 10,413 మంది అభ్యర్థులు హాజరవుతున్నారని తెలిపారు. ప్రతి రోజు 600 మంది అభ్యర్థులు హాజరవుతారని తెలిపారు. జిల్లా పోలీసు యంత్రాంగం తరుపున అన్ని ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేసినట్లు ఎస్పీ తెలిపారు. దేహదారుఢ్య పరీక్షలకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నామని, పరీక్షలు నిర్వహించే ప్రదేశాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలీసు కానిస్టేబుళ్ల అభ్యర్థులు మైదానంలోకి ప్రవేశించిన మొదలుకుని వారు దేహదారుఢ్య పరీక్షలు ముగించుకుని మైదానం నుంచి తిరిగి వెళ్లే వరకు వారికి అర్థమయ్యే రీతిలో ప్రతి పరీక్ష ఘట్టాన్ని సూచించే విధంగా సూచిక బోర్డులను ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులు వారికి కేటాయించిన నిర్దేశిత సమయాల్లో మాత్రమే ఉదయం 5 గంటల నుంచి 10 గంటలలోపు కర్నూలు ఏపీఎస్పీ రెండో బెటాలియన్‌లోకి చేరుకోవాలని తెలిపారు.. దేహధారుఢ్య పరీక్షలకు హాజరయ్యే కానిస్టేబుళ్ల అభ్యర్థులకు ఆయన పలు సూచనలు చేశారు. ఎవరైనా దళారులు, మోసగాళ్లు సంప్రదిస్తే డయల్-100కు గానీ, సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదు చేసిన, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఎవరైనా ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు ఇవ్వాలని ప్రచారం చేస్తే వారి సమాచారాన్ని డయల్ 100, 112 లేదా స్థానిక పోలీసులకు గానీ, పోలీసు వాట్సాప్ నెంబర్లు 7777877722, 9121101100లకు తెలియజేయాలని సూచించారు.

## అలుపెరగని అంకయ్య

- పద్యనాటకాలతో గుర్తింపు
- జాతీయ స్థాయిలో అనేక పురస్కారాలు సొంతం
- ఆరు దశాబ్దాలుగా నాటక రంగంలో రాణిస్తున్న గుర్రపుశాల అంకయ్య

6

## చెరువులను నింపకపోవడం సిగ్గుచేటు

7

## అదుపులో అంతర్ రాష్ట్ర దొంగలు

## 259 అర్జీల స్వీకరణ


కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం 20 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులులో 259 అర్జీలు స్వీకరించినట్లు జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ తెలిపారు. ఆదోని రెవెన్యూ డివిజన్‌లోని గోనెగండ్ల మండలం తిప్పనూరు గ్రామంలో 7, నందవరం మండలంలోని మిట్టసోమాపురంలో 4, ఎమ్మిగనూరు మండలం పార్లపల్లి గ్రామంలో 35, కోసిగి మండలం మూగలదొడ్డి గ్రామంలో 5, కౌతాళం మండలం దోమలదిన్నె గ్రామంలో 2, వీరలదిన్నె గ్రామలో 3, మంత్రాలయం మండలం చిలకలడోనలో 4, పెద్దకడుబూరు మండలం కల్లుకుంట గ్రామంలో 33, ఆదోని మండలంలోని బైచగేరిలో 4, ఎస్.కొండాపురంలో 3, హొళగుంద మండలం హోన్నూరులో 10 అలాగే కర్నూలు రెవెన్యూ డివిజన్‌లోని ఓర్వకల్లు మండలంలోని సోమయాజులపల్లెలో 26, కల్లూరు మండలంలోని పుసులూరులో 5, వెల్దుర్తి మండలం ఎస్. పెరిముల గ్రామంలో 11, కర్నూలు రూరల్‌లోని బసాపురంలో 14, పత్తికొండ రెవెన్యూ డివిజన్‌లోని పత్తికొండ మండలంలో చిన్నహుల్తి గ్రామంలో 11, తుగ్గలి మండలం ఈదులదొడ్డిలో 8, క్రిష్ణగిరి మండలం అగవల్లిలో 63, ఆలూరు మండలంలోని కార్తికిలో 6, ఆస్పరి మండలం చిగిలిలో 5 అర్జీలు వచ్చాయని డీఆర్వో తెలిపారు.

### రేపు ఐదు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

జిల్లాలో సోమవారం ఐదు గ్రామాల్లో రెవెన్యూ అధికారులు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు. ఆదోని రెవెన్యూ డివిజన్‌లోని ఆదోని మండలంలో జాలిమంచి గ్రామం, పాండవగల్లు గ్రామం, కర్నూలు రెవెన్యూ డివిజన్‌లోని కర్నూలు అర్బన్, ఓర్వకల్లు మండలంలోని ఉయ్యాలవాడ గ్రామం, కల్లూరు మండలంలోని రామదూర్ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు.

## శ్రీశైలంలో భక్తుల రద్దీ



కంపార్టుమెంట్లలో వేచి ఉన్న భక్తులు


క్యూలైన్లలో నిల్చున్న భక్తులు

శ్రీశైలం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహాక్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. దీంతో ఆలయ క్యూలైన్లు, ప్రధాన వీధులు భక్తులతో కిటకిటలాడాయి. రెండు తెలుగు రాష్ట్రాలు, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు మల్లికార్జున స్వామి, భ్రమరాంబికాదేవి దర్శనార్థం తరలివచ్చారు. వేకువజాము నుంచే భక్తులు పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి, గంగమ్మకు దీపహారతులు సమర్పించారు. కల్యాణకట్ట వద్ద తలనీలాలు సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు దేవస్థానం అధికారులు నిరంతరం తాగునీరు, అల్పాహారం అందజేశారు. క్షేత్రంలోని నిత్యాన్నదాన సత్రాలు భక్తులకు వసతి, అన్నదానం నిర్వహించి భక్తుల సేవలో తరించారు. ఆదివారం కూడా రద్దీ కొనసాగే అవకాశం ఉంది. దర్శనార్థం శ్రీశైలం విచ్చేసే భక్తులు స్వామి, అమ్మవార్ల దర్శనం తదితర ఆర్జిత సేవా టిక్కెట్లను దేవస్థానం ఆన్‌లైన్ ద్వారా పొంది శ్రీశైలం రావాలని అధికారులు చెప్పారు.

## తుంగభద్ర తీరం సాహిత్యం






'కర్నూలు జిల్లా జానపద కథలు' పుస్తకం

# అపురూపం.. జానపద కథనం

- బాలల ఊహా ప్రపంచాన్ని ఉత్సాహపరిచే పుస్తకాలు
- డాక్టర్ ఎం. హరికిషన్ వినూత్న ప్రయోగం

కర్నూలు కల్చరల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): కథ చదివితే గుర్తుండి పోవాలి. చివరి దాకా ఆసక్తిగా ఉండాలి. ఉత్సుకత రేకెత్తించాలి. ఆ తర్వాత మరో పదుగురికి ఆ కథను చెప్పుకునే కథనం ఉండాలి. ఏ కథకైనా జీవ లక్షణం ఇదే. జానపద కథలు చాలా ఉత్సాహంగా చదవిస్తాయి. అందులోని మాయ మంత్రాలు, కథానాయకుల సాహసాలు, ఊహలకు అందని మలుపులు బాల్యంలో చదువుకున్నా, ఎప్పటికీ మదిలో ఉండిపోతాయి. అలాంటి కథల పుస్తకమే కర్నూలుకు చెందిన ప్రముఖ బాలల కథా రచయిత డాక్టర్ ఎం. హరికిషన్ రాసిన 'కర్నూలు జిల్లా జానపద కథలు'. ఈ పుస్తక రచనకు ముందు ఆయన 12 ఏళ్ల జిల్లా నలుమూలలు తిరిగారు. గ్రామీణ ప్రాంతాల్లోని అమ్మమ్మలతో, నాయనమ్మలతో మాట్లాడి ఈ కథలన్నీ తెలుసుకున్నారు. ఆ కథలు ఉన్నది ఉన్నట్లుగా కాకుండా కేవలం మూల కథను మాత్రమే తీసుకొని, సంభాషణలు, సంఘటనలను పునర్నిర్మిస్తూ ఆసక్తి రేకెత్తించేలా రాశారు. అలా పెద్దల ద్వారా, పిల్లల ద్వారా సేకరించి రచించిన అద్భుత జానపద కథల పుస్తమే ఇది. ఆధునిక జీవితంలో పిల్లలకు కథలు చెప్పే పెద్దవారు లేరు. ఈ తరుణంలో అలనాటి అపురూప జానపద కథల ఖజానాను నేటి బాలలకు అందించారు రచయిత డాక్టర్ ఎం. హరికిషన్. కర్నూలు బుక్ ట్రస్టు ద్వారా 121 కథలతో వెలువడిన ఈ పుస్తకం తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా ఆదరణ పొందడంతో దీప్తి పబ్లికేషన్స్ ద్వారా రెండో ముద్రణ పొంది, 'తెలుగు వారి జానపద కథలు' రూపంలో వెలువడింది. ప్రస్తుతం మూడో ముద్రణకు కూడా సిద్ధంగా ఉంది. ఈ పుస్తకం విశాలాంధ్ర, నవోదయ పబ్లికేషన్స్‌తోపాటు అన్ని ప్రముఖ పబ్లికేషన్స్ స్టాళ్లలో అందుబాటులో ఉంది.




'తెలుగు వారి జానపద కథలు' పుస్తకం

## పల్లె.. నా కలల సౌందర్యం

- ఎస్ఆర్ మందిరాజు, కర్నూలు



వాన చినుకు నేలను
ముద్దాడినప్పుడు
వచ్చే కమ్మని మట్టి వాసన
ఆఘ్రాణించావా...?
చెట్టై ఎదిగి పదుగురికి నీడ
ఇచ్చేందుకు
నేలను చీల్చుకొని విత్తు చూస్తున్న
పోరాటం చూశావా..?
ఆకుపచ్చని తివాచీని ఒళ్లంతా
కప్పుకున్నట్లు
హరిత వర్ణశోభితమై మెరుస్తున్న
పచ్చటి పొలాల సొగసును చూశావా..?
చిరుగాలికి తలలూపుతూ పలుకరించే
గడ్డిపూల సోయగాన్ని ఆస్వాదించావా..?
గరిక పరకలపై కరిగిపోతున్న మంచు
నీరవాన్ని వీక్షించావా..?
గూళ్ల నుంచి ఆహారాన్వేషణకు బయలు
దేరిన పక్షుల కిలకిలారావాలు
పూల సొగసుకు మురిసే తుమ్మెదల
ఝుంకార ధ్వనులు
గోధూళి వేళలోని ఆలమందల మెడల్లోని
చిరు మువ్వల నాదాలు
వీనుల విందు చేసే ఈ పల్లె సీమల్లోని
జుగల్‌బందీ విన్నావా..?
పంట కాలువ గట్టుపై కూర్చొని
చద్దన్నం తింటూ
పైరగాలికి ఎగిరే ముంగురులను
సర్దుకుంటూ
అమ్మ చెప్పే చిన్ననాటి కబుర్లు
అన్నదమ్ములమంతా వింటూ...
ఎంత కాలమైందో...కదా మనమంతా
కలిసి బతికి..
'ఏరా' అనే పలకరింపులో తొంగి చూసే
ఆత్మీయత
'రారా' అనే పిలుపులోని ఆప్యాయత
ఇది మన ఊరి వారికే కదా సొంతం...
ఊరివారంతా మనకే అన్న భావన
మనకే అసొంతం
ప్రపంచీకరణలో విశ్వమే కుగ్రామం
బతుకు బాటలో ఆ కుగ్రామమే మనకు
దూరం
అందుకే వచ్చే సంక్రాంతి వేళ పట్నం
వీడి పల్లెను చేరాలి...
పల్లెలో ప్రతి అణువునూ
తనవితీరా ఆస్వాదించాలి...!

## నగరంలో నేడు



- నగర శివారు మామిదాలపాడులోని శ్రీగోదా రంగనాథ స్వామి దేవస్థానం (గోదా గోకులం)లో ధనుర్మాస వేడుకల్లో భాగంగా ఉదయం 4.30 నుంచి విశేష పూజా కార్యక్రమాలు ప్రారంభిస్తున్నారు. అలాగే మధ్యాహ్నం 11.45 గంటలకు గత ఏడు రోజులుగా ఆలయంలో చేపట్టిన అఖండ విష్ణు సహస్ర నామ పారాయణ సప్తాహం ముగుస్తున్నట్లు గోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజ గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు తెలిపారు.
- బళ్లారి రోడ్డులోని వాసవీనగర్‌లోగల శ్రీవేంకటేశ్వర స్వామి వారి క్షేత్రంలో ధనుర్మాస వేడుకల్లో భాగంగా ఉదయం 7 గంటలకు తిరుప్పావై పారాయణం, ప్రత్యేక ధనుర్మాస పూజలు నిర్వహిస్తున్నారు.
- రెవెన్యూకాలనీలోని భరతమాత మందిరంలో గల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉదయం 6 గంటలకు ధనుర్మాసం పూజలు, తిరుప్పావై పారాయణం చేస్తున్నారు.
- కల్లూరులోని శ్రీ అవధూత రామిరెడ్డి తాత సేవా సంస్థాన్ మందిరంలో ఉదయం 9 గంటలకు 'నూతన సంవత్సర క్యాలెండర్' ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని సంస్థాన్ అధ్యక్షుడు దాసరి రామచంద్రారెడ్డి తెలిపారు.
- నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో సాయంత్రం 6.30 గంటలకు హిందీ చలన చిత్ర నటుడు రాజ్‌కపూర్ శతజయంతి వేడుకల్లో భాగంగా రాజ్‌కపూర్ పాటలతో 'మ్యూజికల్ నైట్' ఏర్పాటు చేసినట్లు నిర్వాహకుడు సిరాజ్ తెలిపారు.



**కవితలకు ఆహ్వానం**

'యువకలం' శీర్షికకు యువకవుల నుంచి 15 లైన్లకు మించ కుండా కవితలను ఆహ్వానిస్తున్నాం. కవితలను పంపవలసిన చిరునామా... **'యువకలం' శీర్షిక, ఆంధ్రజ్యోతి (దినపత్రిక), ఇండస్ స్కూల్ పక్కన, గుత్తి రోడ్, పందిపాడు గ్రామం, కర్నూలు.**

# పరుగులు తీస్తున్న పారిశ్రామికం



ఓర్వకల్లు మండలం గుమ్మటంతాండ పాణ్యం మండలం పిన్నాపురం గ్రామాల మధ్య నిర్మిస్తున్న పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ ప్లాంట్



(5వ పేజీ తరువాయి)

### ఉమ్మడి జిల్లాలో పట్టాలెక్కనున్న పరిశ్రమలు

- జాతీయ పశు ఆరోగ్యం, వ్యాధి నియంత్రణ కార్యక్రమం (ఎన్‌పీడీసీపీ)లో భాగంగా ఎమ్మిగనూరు మండలం బనవాసి జెర్సీ పశుక్షేత్రంలో వ్యాక్సిన్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుకు దృష్టి సారించారు. ఈ పశుక్షేత్రంలో పశుసంవర్ధక శాఖ నుంచి ఎన్‌పీడీసీపీకి 100-150 ఎకరాలు కేటాయించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.
- ఎమ్మిగనూరు మండలం బనవాసి జెర్సీ పశు క్షేత్రంలో మెగా టెక్స్‌టైల్ పార్కులు ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ప్రతిపాదనలు తయారు చేస్తున్నారు.
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆదోనిలో 3, కర్నూలులో 4, నంద్యాలలో 3 కలిపి 10 మాతృభాషలో ఎఫ్ఎం ఛానల్స్ ఏర్పాటుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.
- ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్‌లో రూ.14 వేల కోట్లతో భారీ సెమి కండక్టర్ పరిశ్రమ ఏర్పాటుకు సీఎం చంద్రబాబు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. జపనీస్ సంస్థ, భారత్‌కు చెందిన మరో ఐటీ సంస్థ భాగస్వామ్యంతో కలసి ఏర్పాటు చేయనున్నారు. 130 ఎకరాల్లో ఏర్పాటు చేయబోయే ఈ పరిశ్రమ ఏర్పాటు కోసం జపాన్ ప్రతినిధులు ఇప్పటికే ఓర్వకల్లును పరిశీలించారు.
- ఓర్వకల్లు మండలం పాలకొనను, చింతలపల్లి, కొమరోలు గ్రామాల్లో దాదాపు 300 ఎకరాల్లో 'డ్రోన్ తయారీ పరిశ్రమ' ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే డ్రోన్ తయారీ పరిశ్రమ ప్రతినిధులు, అధికారులు పరిశీలించారు.

### ప్రారంభానికి సన్నాహాలు

పాణ్యం మండలం పిన్నాపురం వద్ద 5,230 మెగావాట్ల యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా సోలార్, విండ్, హైడల్ (పంప్డ్ స్టోరేజ్) విద్యుత్ సబంధించిన ఇంటిగ్రేటెట్ పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టు (ఇంటిగ్రేటెడ్ రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టు-ఐఆర్ఈపీ)కు శ్రీకారం చుట్టారు. పాణ్యం మండలం పిన్నాపురం, ఓర్వకల్లు మండలం గుమ్మటంతాండ గ్రామాల్లో 4,750 ఎకరాల భూములు, గోరుకల్లు రిజర్వాయర్ నుంచి ఒక టీఎంసీ నీటిని కేటాయించారు. ప్రాజెక్టు రూ.15 వేల కోట్ల పెట్టుబడి లక్ష్యం. వైసీపీ ఆయాంలో పనులు మందగించినా.. టీడీపీ కూటమి వచ్చాక వేగం పుంజుకుంది. దాదాపు 85 శాతానిపై పనులు పూర్తయ్యాయి. 2025 నూతన సంవత్సరంలో ప్రారంభానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

### పరిశ్రమలపై వైసీపీ దాడులు:

టీడీపీ కూటమి పరిశ్రమలు తీసుకొచ్చి రాయలసీమ గమనాన్నే మార్చాలి.. యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించాలనే లక్ష్యంగా అడుగులు వేస్తోంది. ఇందుకు విరుద్ధంగా వైసీపీ నాయకులు పరిశ్రమలపై దాడులు చేయడం విమర్శలకు తావిస్తున్నది. ఈ ఏడాది అక్టోబరు 3న ఆలూరు వైసీపీ ఎమ్మెల్యే బసినె విరుపాక్షి సోదరుడు, మరికొందరు వైసీపీ కార్యకర్తలు ఆలూరు, ఆస్పరి, దేవనకొండ మండలాల్లో పవన విద్యుత్తు (విండ్ పవర్) స్టేషన్లు, కార్యాలయాలపై దాడులు చేసి ఫర్నీచర్, కంప్యూటర్లు ధ్వంసం చేశారు. కిటికీల అద్దాలు పగులగొట్టి విధ్వంసం సృష్టించారు. ఇలా చేస్తే పరిశ్రమలు ఎలా వస్తాయని పలువురు ప్రశ్నిస్తున్నారు.

### టీజీ భరత్ పరిశ్రమల శాఖ మంత్రి కావడం కలిసొచ్చిన అవకాశం

జిల్లాకు చెందిన కర్నూలు ఎమ్మెల్యే టీజీ భరత్ రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి కావడం ఉమ్మడి కర్నూలులో పరిశ్రమలు ఏర్పాటుకు కలిసొచ్చిన అవకాశం అని పలువురు అంటున్నారు. స్వయంగా యువ పారిశ్రామి కవేత్త కావడంతో రాష్ట్రానికి, ముఖ్యంగా జిల్లాకు వివిధ పరిశ్రమలు తీసుకురావడంతో టీజీ భరత్ కృషి ఎంతో ఉంది. అదే క్రమంలో రాష్ట్రంలో రూ.65 వేల కోట్లతో బయో గ్యాస్ ప్రాజెక్టులు ఏర్పాటుకు రిలయన్స్ ఇండస్ట్రీస్ ముందుకు రావడంపై పరిశ్రమలు, వాణిజ్య, ఆహారశుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ కృషి అభినందనీయం అని సీఎం చంద్రబాబు కొనియాడారంటే టీజీ కృషి ఏమిటో తెలుస్తుంది. ఈ ఏడాదే పరిశ్రమల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టడం, కీలకమైన పరిశ్రమలు జిల్లాకు తీసుకురావడంతో 2024కు మరవలేని గుర్తింపు వస్తుంది.

## ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు మన్మోహన్ సింగ్

### రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్



కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): దేశంలో ఆర్థిక సంస్కరణలు తీసుకువచ్చి ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించిన మహనీయుడు దివంగత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ కొనియాడారు. మన్మోహన్ సింగ్ మృతి పట్ల తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరని లోటు అన్నారు. రిజర్వు బ్యాంకు గవర్నర్‌గానూ, ఆర్థిక మంత్రిగానూ, దేశ ప్రధాన మంత్రిగా ఆయన దేశానికి అందించిన సేవలు మరువలేనివని అన్నారు. దేశం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పుడు సంస్కరణలు చేపట్టి సంక్షోభం నుంచి గట్టెక్కించడమే కాకుండా ప్రజలకు ఎన్నో రకాల సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత మన్మోహన్ సింగ్‌కు దక్కుతుందన్నారు. తెలంగాణ ఉద్యమంలో రాష్ట్రం విడిపోతే రాయలసీమకు జరిగే అన్యాయన్ని మన్మోహన్‌సింగ్‌కు వివరిస్తే దానికి ఆయన స్పందిస్తూ వెనుకబాటుకు గురైన రాయలసీమకు అన్యాయం జరగనీయబోమని హామీ ఇచ్చారని టీజీ చెప్పారు. రాయలసీమ అభివృద్ధికి, రాయలసీమ హక్కుల ఐక్యవేదిక కోరిన ప్రజల పలు డిమాండ్లను నెరవేర్చి వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిపై తన చిత్తశుద్ధిని మన్మోహన్ నిరూపించుకున్నారని అన్నారు.

## వందశాతం ఉత్తీర్ణత సాధించాలి: డీఈవో

ఓర్వకల్లు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని డీఈవో శామ్యూల్ పాల్ సూచించారు. మండలంలోని నన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. 2025 పరీక్ష పే చర్చను పరిశీలించారు. డీఈవో మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ అమలు చేస్తున్న గల్లీ నుంచి దేశ రాజధాని ఢిల్లీకి వెళ్లి ప్రధానితో భేటీ కావాలనుకున్నట్లయితే విద్యార్థులకు అద్భుత అవకాశం ఉందని, అందుకోసం వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. జనవరిలో నిర్వహించే 8వ ఎడిషన్ పరీక్ష పే చర్చా కార్యక్రమంలో పాల్గొనేందుకు 6 నుంచి 12వ తరగతి చదువుతున్న విద్యార్థులు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల నుంచి కేంద్ర ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానిస్తోందని చెప్పారు. నన్నూరు సమీపంలో బిర్లా ఓపెన్ మైండ్స్ పాఠశాలను సందర్శించి మ్యాథ్స్ డే సెలబ్రేషన్‌లో పాల్గొని విద్యార్థులు ప్రదర్శించిన మోడల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో ఓంకార్ యాదవ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కళ




పదకొండేళ్ల ప్రాయం నుంచి నటన, నాటకం పంచప్రాణాలుగా భావిస్తూ చదువులో దూసుకుపోయిన ఆయన బీకాం డిగ్రీ పూర్తి చేశారు. డిగ్రీ కళాశాలలో చేరేందుకు డబ్బు లేకపోయినా ఆయనలోని కళాప్రతిభను గుర్తించిన ప్రిన్సిపాల్ మూడేళ్లు ఉచితంగా చదువుకునే అవకాశం కల్పించారు. అనంతరం పోలీసు శాఖలో ఉద్యోగంలో చేరి 20 ఏళ్లు సుమారు 9 మండల స్టేషన్లలో ఎస్ఐగా పనిచేసి అధికారుల ప్రశంసలతో పదవీ విరమణ చేశారు. ఇటు నాటక రంగంలో ఆరు దశకాలు పూర్తి చేశారు. ఆయనే కర్నూలుకు చెందిన ప్రముఖ పౌరాణిక పద్య నాటక కళాకారుడు, ఈలపాట గాయకుడు, నంది అవార్డు గ్రహీత గుర్రపుశాల అంకయ్య. ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం మండలం గంగుపల్లి గ్రామంలో 1950 జూలై 1న జన్మించిన అంకయ్యది పెద్ద వ్యవసాయ కుటుంబం. ఇంట్లో ఉన్న బర్రెలు కాసేవారు లేక, పదేళ్ల బాల్యంలో వాటిని మేతకు తోలుకు వెళ్లడం దినచర్యగా ఉండేది. గ్రామంలో వేస్తున్న రామాయణం నాటకంలో కుశుని పాత్రకు బాల కళాకారుడు కావాల్సి వచ్చింది. అప్పుడు ఓ చిన్న పద్యంతో మొదలైన ఆయన ప్రస్థానం నేటివరకూ కొనసాగుతోంది.

# అలుపెరగని అంకయ్య

- పద్యనాటకాలతో గుర్తింపు
- జాతీయ స్థాయిలో అనేక పురస్కారాలు సొంతం
- ఆరు దశాబ్దాలుగా నాటక రంగంలో రాణిస్తున్న గుర్రపుశాల అంకయ్య

కర్నూలు కల్చరల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): హైస్కూల్ చదువుకు గ్రామం నుంచి 5 కి.మీ.దూరంలోని ఏనుగులదిన్నెపాలెం వెళ్లి చదువుకోవాల్సి వచ్చేది. అలా నిత్యం పది కి.మీ. నడుస్తూ నడక అలుపు రాకుండా రామాయణం, శ్రీకృష్ణ రాయబారంలోని పద్యాలను ఆలపిస్తూండేవాడు. ఏ రాగం ఏస్థాయిలో పాడాలి, ఏ రాగానికి ఎంత శృతి ఉండాలి వంటివి నేర్చుకొని నటించిన పాత్రలన్నీ మెప్పించి తనదైన జిల్లా నాటక రంగంపై తనదైన ముద్ర వేశారు. పౌరాణిక పాత్రలైన శ్రీకృష్ణ, శ్రీరామ, కార్యవర్ధిరాజు (బాలనాగమ్మ), ధర్మరాయుడు (బొబ్బిలి యుద్ధం), బృహస్పతి (తారా శశాంకము), రామభద్ర కవి (భువన విజయము), షిరిడీ సాయిబాబా (సాయి లీలలు) ఆంజనేయుడు తదితర వేషాలు ధరించారు.

### 'ఈలపాట'లో మేటి...

'ఈలపాట' ఆలపించడంలో అంకయ్య గుర్తింపు పొందారు. సినీ పాటలు, రంగస్థల పద్యాలతోపాటు, అనేక శ్లోకాలు, ప్రార్థనలు వంటివి ఈలపాట ద్వారా పాడి ప్రేక్షకుల్లో ఈలపాట అంకయ్యగానూ ప్రాచుర్యం పొందారు. పోలీసు శాఖలో పని చేస్తున్న కాలంలో సాంఘిక దురాచారాలపై సుమారు 200 పైగా ప్రదర్శనలు చేసి, నాటి డీజీపీ, ఎస్పీల చేత ప్రశంసాపత్రాలు అందుకున్నారు.



2015లో తిరుపతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా నంది అవార్డు తీసుకుంటున్న అంకయ్య

### సాధించిన పురస్కారాలు

1995లో హైదరాబాదు త్యాగరాజ గానసభలో చింతామణి నాటకంలో బిల్వ మంగళుడు పాత్రకు నట ప్రవీణ బిరుదు పొందారు.

2002లో హైదరాబాదు రవీంద్రభారతిలో శ్రీరాముని పాత్రకు ఈలపాట రఘురామయ్య అవార్డు.

2008 తుంగభద్ర పుష్కరాల్లో నాటి కలెక్టర్ నుంచి ఉత్తమ నటుడిగా గుర్తింపు.

2013లో తిరుపతిలో బభ్రు వాహన విజయం నాటకంలో శ్రీకృష్ణ పాత్రకు ఉత్తమ నటుడిగా బంగారు గరుడ అవార్డు.

2015లో రాజమండ్రిలో జరిగిన నంది నాటక పోటీల్లో శ్రీకృష్ణ పాత్రకు ఉత్తమ నటుడిగా బళ్లారి రాఘవ నంది అవార్డు.

2016లో ఒంగోలులో జరిగిన ఎన్టీఆర్ కళాపరిషత్ పోటీల్లో కర్ణార్జునీయం నాటకంలో శ్రీకృష్ణపాత్రకు ఉత్తమ నటుడిగా ఎన్టీఆర్ అవార్డు.

2017లో కర్నూలులో జరిగిన నంది నాటక పోటీల్లో శ్రీకృష్ణ భీమసేనమ్ నాటకంలో శ్రీకృష్ణ పాత్రకు నటుడిగా జ్యూరీ నంది అవార్డు.

2017లో తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో ఉత్తమ నటుడు అవార్డు.

2024 తణుకులోని షణ్ముఖి ఆంజనేయరాజు కళాపీఠం పురస్కారం లభించింది.



2016లో నాటి ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి, మాజీ మంత్రి టీజీ వెంకటేశ్ చేతుల మీదుగా సత్కారం

### పద్య నాటకాలకు ఆదరణ పెరగాలి

'కావ్యేషు నాటకం రమ్యం' అని కావ్యాలకంటే నాటకాలు రమ్యంగా ఉంటాయని శాకుంతల నాటకంలో ఏనాడో చెప్పారు. ఒకప్పుడు పద్య నాటకాలు, తర్వాత సాంఘిక నాటకాలకు రాష్ట్రం పుట్టినిల్లు. తర్వాతే ఇతర కళలు ఆదరణ పొందేవి. కానీ మారుతున్న కాలంలో నాటక రంగం చాలా వెనక్కు వెళ్లిపోతోంది. ఇది ఆందోళన కలిగించే విషయం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నాటకాలకు ఆదరణ కల్పించాలి. ముఖ్యంగా మన తెలుగు పద్య నాటకాలకు ఆదరణ పెరిగేలా కార్యక్రమాలు ఏర్పాటు చేసి కళాకారులను ప్రోత్సహించాలి.

-గుర్రపుశాల అంకయ్య



షిరిడీ సాయి పాత్రలో.,

## నేటి నుంచి జిల్లా మహాసభలు

ఎమ్మిగనూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): సీపీఎం కర్నూలు జిల్లా 23వ మహాసభలు నేటి నుంచి ఎమ్మిగనూరులో ప్రారంభం కానున్నాయి. రెండు రోజులపాటు జరిగే మహాసభలకు నాయకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మహాసభల్లో భాగంగా మొదటి రోజు భారీ బహిరంగ సభను నిర్వహించనున్నారు. పట్టణంలోన ర్యాలీ, స్థానిక పాత తహసీల్దార్ కార్యాలయం దగ్గర బహిరంగ సభను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. పట్టణ ప్రధాన రహదారుల్లో ఎర్రజెండాలతో తోరణాలు కట్టారు. మహాసభలను జయప్రదం చేయాలని జీపులో గ్రామాల్లో ప్రచారం చేశారు. మోటర్ బైక్‌లపై పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

## చిరుత సంచారం

మహానంది, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మహానంది మండల పరిధిలోని వ్యవసాయ కళాశాల భూమిలో శనివారం చిరుత ప్రత్యక్షం అయ్యింది. దీంతో పొలంలో పనులు చేస్తున్న కూలీలు పరుగులు తీసారు. స్థానిక ఉద్యానవన పరిశోధన స్థానం పరిసరాల్లోని వ్యవసాయ కూలీలు పనులు ముగించుకొని మధ్యాహ్నం భోజనం చేస్తుండగా సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతం నుండి చిరుత పులి ప్రత్యక్షం కావడంతో భయ భ్రాంతులకు గురై పరుగులు తీశారు.

## అప్పుల బాధతో వృద్ధ రైతు ఆత్మహత్య

● బాధిత కుటుంబాన్ని పరామర్శించిన తహసీల్దార్

కొత్తపల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక సమస్యలతో కొత్తపల్లి మండలం లింగాపురం గ్రామానికి చెందిన రైతు చిమ్మె నడిపి మారెన్న (70) క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన చిమ్మె నడిపి మారెన్నకు ఇద్దరు భార్యలు కాగా, పెద్ద భార్యకు ముగ్గురు కొడుకులు, ఒక కుమార్తె. రెండో భార్యకు ఇద్దరు కొడుకులు. ఇద్దరు భార్యలు అనారోగ్యంతో ఇది వరకే మరణించారు. మృతునికి ఏడె కరాల వ్యవసాయ భూమి ఉన్నప్పటికీ సరైన పంటలు రాక అప్పులపాలయ్యాడు. పిల్లల చదువులు, ఇంటి నిర్మాణం కోసం సుమారు రూ.10లక్షల మేర అప్పు చేశాడు. ఈ అప్పులు ఎలా తీర్చాలో తెలియక తీవ్ర మానసిక వేదనకు గురై శుక్రవారం సాయంత్రం ఇంట్లోని క్రిమిసంహారక మందును తాగాడు. అపస్మారక స్థితిలో వెళ్లిన మారెన్నను కుమారులు హుటాహుటిన ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అక్కడి వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడని ఏఎస్ఐ తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న కొత్తపల్లి తహసీల్దార్ ఉమారాణి మృతుని కుటుంబాన్ని పరామర్శించి నివాళులర్పించారు. మృతుని పెద్ద కుమారుడు అల్లెన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొత్తపల్లి ఏఎస్ఐ బాబా ఫకృద్దీన్ తెలిపారు.

## కొమ్ముచెరువులో కర్నూలు వాసి..

ఓర్వకల్లు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కర్నూలులోని గీతానగర్‌కు చెందిన ఉప్పర శివన్న(57) చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మతిస్థిమితం లేకపోవడంతో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లిపోయాడు. అతని కోసం కుటుంబ సభ్యులు గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. శుక్రవారం మండలంలోని కొమ్ముచెరువు ఆంజనేయ స్వామి దేవస్థానం సమీపంలోని ఓ చెట్టుకు ఉరి వేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. శనివారం మృతుడి భార్య ఉప్పర పార్వతమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సునీల్‌కుమార్ తెలిపారు.

## కోర్టు భవనాల పరిశీలన



బనగానపల్లె కోర్టును పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ది

బనగానపల్లె, డిసెంబరు 28, (ఆంధ్రజ్యోతి): గత 120 ఏళ్ల క్రితం నవాబుల కాలంలో నిర్మించిన బనగానపల్లె కోర్టు భవనాలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ది శనివారం పరిశీలించారు. కోర్టు భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో పరిపాలన సౌలభ్యం కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు న్యాయవాదులు ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. గతవారంలో బనగానపల్లె న్యాయవాదులు జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలసి బనగానపల్లె కోర్టు భవనం అధ్వానస్థితిలో ఉన్నట్లు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ మేరకు జిల్లా జడ్జితో పాటు బనగానపల్లె ఇన్‌చార్జి న్యాయమూర్తి అబ్దుల్ రహమాన్ కోర్టు భవనాన్ని పరిశీలించారు. గతంలో నవాబు కాలంలో నిర్మించిన భవనాన్ని ఆర్కియాలజీవారు స్వాధీనం చేసుకోవడంతో వాటిని శిథిలం చేయకుండా పక్కనే ఉన్న స్థలంలో నిర్మించేందుకు ఎస్టిమేషన్లు పరిశీలించారు. ఉన్నతాధికారులతో చర్చించి కోర్టు భవనాన్ని నిర్మిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఖాజాహుసేన్, సెక్రటరీ జేమ్స్, సీనియర్ న్యాయవాదులు పరశురామిరెడ్డి, యూసుఫ్‌హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

## స్టీరింగ్ రాడ్ ఊడి అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు



స్టీరింగ్ ఊడిపడడంతో అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు

ఆస్పరి, డిసెంబరు28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కైరుప్పల గ్రామ సమీపంలో పత్తికొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శనివారం స్టీరింగ్ రాడు ఊడి అదుపు తప్పింది. పత్తికొండ నుంచి ఎమ్మిగనూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు కైరుప్పల గ్రామ సమీపంలో స్టీరింగ్ రాడు ఊడిపోయింది. అదే సమయంలో గోనెగండ్ల మండలం బైలుపల గ్రామానికి చెందిన పెద్దయ్య తన స్వగ్రామం నుండి పత్తికొండ వెళ్తున్నాడు. స్టీరింగ్ రాడ్ ఊడిపోవడంతో బస్సు టైరు పెద్దయ్య మీదికి దూసుకెళ్లి కుడికాలుపై వెళ్లడంతో గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



గోరంట్ల (ఫైల్)

గోనెగండ్ల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): హెచ్.కైరవాడి, పెద్దనేలటూరు గ్రామాల మధ్య ఉన్న జడ్పీ ఉన్నత పాఠశాల దగ్గర గోరంట్ల(25)అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పెద్దనేలటూరు గ్రామానికి చెందిన గోరంట్ల పెయింటింగ్ పని చేస్తూ జీవనం సాగించేవాడు. అయితే గోరంట్ల గత కొన్ని నెలలుగా గోనెగండ్లలోని ఓ దుకాణంలో పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. రోజు మాదిరే గోనెగండ్లకు వచ్చాడు. పరిచయస్థుల వివాహం జరుగుతుండటంతో హాజరై సాయంత్రం తిరిగి తన స్వంతగ్రామానికి ద్విచక్రవాహనంలో బయలు దేరాడు. హెచ్.కైరవాడిలో జడ్పీ హైస్కూల్ వద్ద బైకు ముందు టైర్ పగిలి పోయి రోడ్డుపై పడ్డాడు. దీంతో తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గోరంట్లకు భార్య శృతి, రెండేళ్ల కుమారుడు ఉన్నారు. యువకుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగాధర తెలిపారు.

## కర్ణాటక డ్రైవర్..

బనగానపల్లె, డిసెంబరు 28, (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మండలంలోని దద్దనాల ప్రాజెక్టు మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్ణాటక రాష్ట్రం యాదగిరి జిల్లాకు చెందిన రమేశ్( 29) మృతి చెందాడు. ఈ ఘటన శనివారం జరిగింది. దద్దనాల ప్రాజెక్టు మలుపు రోడ్డు వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు భారీ లారీ ట్యాంకర్లు ఢీకొనడంతో కర్ణాటకకు చెందిన వాహనం డ్రైవర్ రమేశ్ అక్కడిక్కడే మృతి చెందాడు. మరో డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు బనగానపల్లె ఎస్ఐ దుగ్గిరెడ్డి తెలిపారు.

# చెరువులను నింపకపోవడం సిగ్గుచేటు

● ఇరిగేషన్ అధికారులపై జడ్పీ చైర్మన్ ఆగ్రహం

● ముగిసిన జడ్పీ స్థాయి సంఘ సమావేశాలు



మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో 77 చెరువులను, అలాగే రిజర్వాయర్లను నింపలేకపోవడం సిగ్గుచేటని, వరద నీళ్లు సుమారు 2000 టీఎంసీలు వస్తే కూడా నింపడంలో విఫలమయ్యారని జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఇరిగేషన్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం నగరంలోని జడ్పీ మినీ సమావేశం భవనంలో ఏడు స్థాయి సంఘ సమావేశాలు నిర్వహించారు. చైర్మన్ అధ్యక్షత వహించగా సీఈవో జి.నాసరరెడ్డి పర్యవేక్షించారు. జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ కేవలం 1.50 టీఎంసీల నీటితో 77 చెరువులను నింపే ఆస్కారం ఉందన్నారు. ఉమ్మడి జిల్లాలోని మేజర్ పంచాయతీలకు ఆదాయ మార్గాలు పెంచేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ఉమ్మడి జిల్లాలో రైతులకు సకాలంలో విత్తనాలు పంపిణీ చేయాలన్నారు. నాసిరకం విత్తనాలను అరికట్టాలన్నారు. గ్రామాల్లో కూలీలు ఖాళీగా ఉన్నప్పుడు ఉపాధి హామీ పనులు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కేజీబీవీలో సీట్ల సంఖ్య పెంచే విధంగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలన్నారు. డిప్యూటీ సీఈవో వెంకటసుబ్బారెడ్డి, జడ్పీటీసీలు దివ్య, సుధాకర్‌రెడ్డి, సుంకన్న, పోచా జగదీశ్వరరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, అనసూయమ్మ, ఉమ్మడి జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

**జడ్పీటీసీలు ఏమన్నారంటే...**

పర్మినెంటు పంచాయతీ కార్యదర్శులను నియమించాలని వెల్దుర్తి, ప్యాపిలి జడ్పీటీసీలు కోరారు. కొత్తపల్లి మండలం ఎర్రమఠం సచివాలయంలో సిబ్బంది కొరత ఉందని జడ్పీటీసీ అన్నారు. రైతులను దృష్టిలో ఉంచుకుని ఉపాధి హామీ పనులు జనవరి 15 తర్వాత ప్రారంభించాలని ప్యాపిలి జడ్పీటీసీ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఓర్వకల్లు ఆసుపత్రిలో స్కానింగ్, ఎక్స్‌రే యంత్రాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జడ్పీటీసీ చెప్పారు. మిడ్తూరు-గార్గేయపురం రోడ్డు పనులు ఎందుకు ప్రారంభించలేదని, నందికొట్కూరు-పగిడ్యాల ప్యాచ్ పనులు ఇంకా ప్రారంభంకాకపోవడం సరికాదని జూపాడుబంగ్లా జడ్పీటీసీ అన్నారు. మహానంది నుంచి గాజులపల్లె రోడ్డు వేయాలని జడ్పీటీసీ, మద్దికెర నుంచి గుంతకల్లు మధ్య కసాపురం వరకు గత ప్రభుత్వంలోనే టెండరు వేసిన రోడ్డు పనులు ప్రారంభంకాలేదని జడ్పీటీసీ, గడివేముల నుంచి మంచాలకట్ట రోడ్డు పూర్తిగా గుంతలమయం గా మారిందని తక్షణమే మరమ్మతులు చేపట్టాలని జడ్పీటీసీ కోరారు.

**కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు కృషి**

**- బస్తిపాటి నాగరాజు, కర్నూలు ఎంపీ**



కర్నూలు పార్లమెంటు పరిధిలో కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తే కేంద్ర మంత్రితో సంప్రదించి వాటిని మంజూరు చేయిస్తాను. పంచలింగాల గ్రామంలో మైనార్టీ పాఠశాల ఇతర ప్రాంతంలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలి. ముస్లిం స్మశానాలకు ప్రహరీ నిర్మించాలి. పాఠశాలల్లో సీట్ల సంఖ్య పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి. యునాని మెడిసిన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపిస్తే కేంద్ర మంత్రితో చర్చిస్తాను.

**● కమ్యూనిటీ భవన నిర్మాణాల్లో జాప్యం వద్దు**

**● గిత్తా జయసూర్య, నందికొట్కూరు ఎమ్మెల్యే**



నందికొట్కూరు నియోజకవర్గంలో కమ్యూనిటీ భవనాల నిర్మాణంలో అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారు. ఏమైనా అడిగితే సైట్ దొరకలేదని సమాధానం చెబుతున్నారు. అధికారులు సొంత నిర్ణయాలు తీసుకుంటే సరిపోదు. 2017-18 సంవత్సరంలో నియోజకవర్గంలో 13 అంగన్‌వాడీ కేంద్రాలు మంజూరయ్యాయి. అవి ఏ దశంలో ఉన్నాయో వివరాలు ఇవ్వాలి. ఉమ్మడి జిల్లాలోని సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో అవకతవకలు జరుగుతున్నాయి. ఇచ్చిన పనులు సకాలంలో పూర్తి చేయాలి.

# కొబ్బరి సాగుకు ప్రోత్సాహం

● ఉద్యానశాఖ డీడీ ఉమాదేవి





మాట్లాడుతున్న ఉద్యానశాఖ డీడీ ఉమాదేవి

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కొబ్బరి సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఉద్యానశాఖ డీడీ, ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి తెలిపారు. కొబ్బరి సాగులో సాంకేతిక పరిజ్ఞానంపై శనివారం కర్నూలు నగరంలోని ఉద్యాన భవన్‌లో సాంకేతిక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలో కొబ్బరి సాగుకు ఉన్న అవకాశాలు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంపై రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఏ విధంగా అందజేయాలో అవగాహన కల్పించేందు కోసం పెద్ద ఎత్తున ఉద్యానశాఖ అధికారులు, సిబ్బంది గ్రామాల్లో పర్యటించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డా.వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ ప్రధాన శాస్త్రవేత్త ఎం.తిరుపతిరెడ్డి మాట్లాడారు. ఉమ్మడి జిల్లా వాతావరణం కొబ్బరి సాగుకు ఎంతో అనుకూలంగా ఉందని, రైతులు కొబ్బరితో పాటు ఇతర ఉద్యాన పంటలను సాగు చేసి అధిక ఆదాయం పొందేలా ఉద్యానశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కొబ్బరి పంటలో వ్యాపించే చీడపీడల నివారణకు ఏ విధమైన యాజమాన్య పద్ధతులు చేపట్టాలో వారు రైతులకు వివరించారు. కోకోనట్ బోర్డు డిప్యూటీ డైరెక్టర్ కుమారవేలు మాట్లాడుతూ కొబ్బరి పంట సాగు చేయడం ద్వారా రైతులు ఏ విదంగా లాభం పొందుతారో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎటువంటి రాయితీలు ఇచ్చి ప్రోత్సహిస్తుందో వివరించారు. డీడీ ఉమాదేవి మాట్లాడుతూ కొబ్బరి పంట సాగు కోసం కోకో నట్ డెవలప్‌మెంట్ బోర్డు అందించే పథకాల గురించి వివరించారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి రామాంజనేయులు మాట్లాడుతూ కొబ్బరి పంట యొక్క ప్రాముఖ్యత, అదే విదంగా కొబ్బరి పంట సాగు వల్ల వచ్చే ఆదాయాన్ని రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి రామాంజనేయులు, ఏపీడీ రాధాకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

# అంతర్ రాష్ట్ర దొంగల అరెస్టు

● పరారీలో మరో ఇద్దరు

● రూ.1.76 లక్షల నగదు, 20 గ్రాముల బంగారు అభరణాలు



దొంగల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సోమన్న

ఆదోని, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఆదోని పట్టణంలోని తిమ్మారెడ్డి బస్టాండ్ వద్ద శనివారం అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. శనివారం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ సోమన్నతో పాటు సీఐ శ్రీరామ్ విలేకరుల వివరాలను వెల్లడించారు. ఆలూరు పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన గోవిందరాజులు, నంద్యాల జిల్లా డోన్ పట్టణంలోని చిరుమాన్ పేటకు చెందిన ఎరుకలి బండిచిన్న అనే వ్యక్తులు చిన్నచిన్న దొంగతనాలకు పాల్పడుతూ ఉండేవారు. ఈ ఇద్దరు మరో ఇద్దరిని కలుపుకుని దొంగతనాలు చేస్తూ జల్సాలకు అలవాటు పడ్డారు. అందులో భాగంగానే ఆదోని టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో రెండు కేసులు, ఆదోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఒక కేసు, కర్నూల్‌లో ఒక కేసు వీరిపై నమోదు అయ్యాయని తెలిపారు. ఈ కేసులలో ఎలాంటి పురోగతి కనిపించకపోవడంతో ఇటీవల ఎస్పీ బిందు మాధవ్ రికవరీ విషయాల్లో చాలా వెనకబడ్డారని, ప్రత్యేక టీం ఏర్పాటు చేసుకుని పురోగతి సాధించాలని సూచించారు. దీంతో డీఎస్పీ సోమన్న తనదైన శైలిలో వన్‌టౌన్ సీఐ శ్రీరామ్‌తోపాటు సిబ్బందిని ఒక టీముగా ఏర్పాటు చేసి రికవరీపై ప్రత్యేక దృష్టి సారించారు. అందులో భాగంగానే ఆలూరు చెందిన గొవిందరాజులతోపాటు డోన్ పట్టణంలోని చిరుమాన్ పేటకు చెందిన ఎరుకలి బండి చిన్నాలను అరెస్టు చేశారు. వారి వద్ద నుండి 80 గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు, రూ.1.76 లక్షలు నగదును స్వాధీనం చేసుకున్నారు. ఆదోని పట్టణంలోని మూడు కేసులు, కర్నూల్‌లోని ఒక కేసుకు సంబంధించిన నగదుతో పాటు బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. అందులో భాగంగానే ఆదోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన రూ.1.24 లక్షలు, ఆదోని టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 45 గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు రూ.50వేల నగదును, కర్నూలులోని నాలుగో పట్టణ పరిధిలోని 40గ్రాముల బంగారం ఆభరణాలును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి విలువ దాదాపు రూ.6.24లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలతో పాటు రూ.1.76లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిలో మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని, వారి కోసం ప్రత్యేక టీంను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇంత పెద్ద మొత్తంలో స్వాధీనం చేసుకున్న ప్రత్యేక టీం అయిన శ్రీరామ్‌తో పాటు హెడ్ కానిస్టేబుల్ సత్తార్ వలి, పోలీసులు లక్ష్మన్న, అశోక్ కుమార్, మునిస్వామి, రామచంద్రలను డీఎస్పీ సోమన్న ప్రత్యేకంగా అభినందించారు. వీరికి నగదు బహుమతి అందించేందుకు ఎస్పీకి సిపారసు చేసినట్లు డీఎస్పీ సోమన్న తెలిపారు.

# జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్‌గా సింధూ సుబ్రహ్మణ్యం



ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌ను కలిసిన హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల అడ్మినిస్ట్రేటర్‌గా డిప్యూటీ కలెక్టర్ పి. సింధూ సుబ్రహ్మణ్యం శనివారం బాధ్యతలు చేపట్టారు. గత నెల 29వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం కర్నూలు జీజీహెచ్‌కు ఎన్నడూ లేని విధంగా పరిపాలనకు సంబంధించి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పి. సింధూ సుబ్రహ్మణ్యంను నియమించింది. ఈ మేరకు విధుల్లో చేరిన డిప్యూటీ కలెక్టర్ కర్నూలు జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డా.కే. సీతారామయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. సింధూ సుబ్రహ్మణ్యం సీనియర్ ఐఏఎస్ అధికారి డా.పి. సుబ్రహ్మణ్యం కూతురు. వీరిది నెల్లూరు జిలా. డిప్యూటీ కలెక్టర్‌గా కోనసీమ జిల్లాలో మొదట పని చేసిన సింధూ సుబ్రహ్మణ్యంను ప్రస్తుతం కర్నూలు జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్‌గా బాధ్యతలు తీసుకున్నారు. ఆసుపత్రిలో సెక్యూరిటీ, పారిశుద్యం, ల్యాండ్రీ బయోమెడికల్ పరికరాలు నిర్వహణ ఏజెన్సీ పనులను పర్యవేక్షించనున్నారు.

# వైసీపీ తీరు హాస్యాస్పదం: మంత్రి ఫరూక్



మాట్లాడుతున్న మంత్రి ఫరూక్

నంద్యాల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో పెంచిన విద్యుత్ చార్జీలను కూటమి ప్రభుత్వంపై నిందమోపు నా ఆ పార్టీ నాయకులే ధర్నాలు చేయడం హాస్యాస్పదంగా ఉందని న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. నంద్యాలలోని టీడీపీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. జగన్‌ను ఉద్దేశించి మంత్రి ఫరూక్ మాట్లాడుతూ మీరు పెంచిన విద్యుత్ చార్జీలపై మీరు ధర్నాలకు పిలుపునివ్వడం విడ్డూరంగా ఉందన్నారు. వైసీపీ చేస్తున్న ధర్నాలకు ప్రజల్లోనేకాకుండా సొంత పార్టీలోనే నాయకులు, కార్యకర్తలనుంచి ఎలాంటి స్పందన కనబడటం లేదని అన్నారు. అధికారం కోల్పోయి ఏం చేయాలో తోచక కూటమి ప్రభుత్వంపై బురదజల్లాలనే ఉద్దేశంతో వైసీపీ ఉందన్నారు. జగన్ విధ్వంసం చేసిన విద్యుత్‌శాఖను సీఎం చంద్రబాబు గాడిన పెడుతున్నారన్నారు. 22.5మిలియన్ యూనిట్ల కొరత ఉన్నా రాష్ట్రాన్ని 2019నాటికి మిగులు విద్యుత్ రాష్ట్రంగా తీర్చిదిద్దితే వైసీపీ ప్రభుత్వం ప్రజలపై రూ.35వేల కోట్ల విద్యుత్‌భారం మోపడమే కాకుండా రూ.1.20లక్షల కోట్ల నష్టాన్ని విద్యుత్‌శాఖకు తెచ్చిపెట్టిందని అన్నారు. గుట్టుచప్పుడుకాకుండా డిస్కంలతో ప్రజలపై భారం వేయండని ఈఆర్సీకి ప్రతిపాదనలు పంపింది మీ హయాంలో కాదా? అని సూటిగా ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో విద్యుత్‌శాఖలో జరిగిన అవకతవకలు, నష్టాన్ని సవరణ చేసే బాధ్యత ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్నారన్నారు. ఏటా విద్యుత్ వినియోగం సగటున 6శాతం పెరుగుతోందని దానికి తగ్గట్టు విద్యుత్ ఉత్పత్తిని కూడా పెంచాల్సి ఉంటుందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొనే టీడీపీ గతంలో అధికారంలో ఉన్నప్పుడే వీటీపీఎస్, కృష్ణపట్నం జెన్‌కో ప్లాంట్ల సామర్థ్యాన్ని విస్తరించామని, కానీ జగన్మోహన్‌రెడ్డి వాటిని పూర్తి చేయలేకపోయారని విమర్శించారు. జగన్ చేసిన పెద్ద పొరపాటు పీపీఏలను రద్దు చేయడమని, వాటి రద్దువల్ల 8వేల మెగావాట్ల విద్యుత్‌ను రాష్ట్రం కోల్పోవాల్సి వచ్చిందని అన్నారు. ఆ 8వేల మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్‌ను సీఎం చంద్రబాబునాయుడు అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. అయిదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క మెగా వాట్ కూడా విద్యుదుత్పత్తి చేయలేదని అన్నారు. రాష్ట్రానికి జగన్ చేసినంత నష్టాన్ని ఏ పార్టీ నాయకుడు చేయలేదని మండిపడ్డారు.

## ఇద్దరికి గాయాలు

పత్తికొండ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): పత్తికొండ శివారులో ఉరుకుంద ఈరన్న దేవాలయం వద్ద బైకును కారు ఢీకొన్న సంఘటనలో శనివారం ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. పట్టణానికి చెందిన రియల్‌ఎస్టేట్ వ్యాపారులు శ్రీనివాసులు, పకృద్దీన్ ఉరుకుంద ఈరన్న దేవాలయం వద్ద మోటార్‌సైకిల్‌పై రోడ్డుకు అవతలి వైపుకు వెళుతుండగా మంత్రాలయం నుండి చెన్నై వెళుతున్న భక్తుల కారు వీరిన ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వీరిద్దరు గాయపడడంతో పత్తికొండ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## నగల్లపాడులో చోరీ

**4 తులాల బంగారు నగలు, రూ. 25 వేలు అపహరణ**

చాగలమర్రి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నగల్లపాడు గ్రామంలో మౌలాలి ఇంట్లో పట్టపగలు దొంగలు బీరువాను పగలగొట్టిన బంగారు నగలు, నగదు ఎత్తుకెళ్లారు. గృహానికి వేసిన తాళం పగలగొట్టి ఇంట్లోకి వెళ్లి 4 తులాల బంగారు నగలు, రూ.25 వేలు నగదును తీసుకెళ్లినట్లు బాధితుడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మౌలాలి విధుల నిమిత్తం పాఠశాలకు వెళ్లారు. పొలం పనుల నిమిత్తం వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళం పగలగొట్టి ఉండటంతో మౌలాలి ఆయన భార్య సమాచారం అందించారు. దీంతో బాధితులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. హెడ్‌కానిస్టేబుల్ శంకర్, పోలీసులు చోరీ జరిగిన గృహం వద్దకు వెళ్లి పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించాలి



క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత, టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్

**ఓర్వకల్లు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి):** ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించాలని ఎమ్మెల్యే గౌరు చరిత కోరారు. శనివారం మండలంలోని కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయంలో 2025 సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యేతోపాటు టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్ విడుదల చేశారు. అంతకుముందు ఆలయ ఈవో మద్దిలేటి, ప్రధాన అర్చకులు కల్లె లక్ష్మీనారాయణశర్మ, కల్లె లక్ష్మీనరసింహ శర్మలు వీరికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం శివునికి అభిషేకాలు, అమ్మవారికి కుంకు మార్చన పూజలు చేశారు. అనంతరం కాల్వబుగ్గ రామేశ్వరుని క్యాలెం డర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాల్వబుగ్గ ఆలయ అభివృద్ధికి టీటీడీకి రూ.2 కోట్లతో ప్రతిపాదనలు పంపామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ లక్ష్మణ్‌రావు, నాయకులు గోవిందరెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, చదువుల సుధా కర్ రెడ్డి, చంద్రపెద్ద స్వామి, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, సుధాకర్, కాకి దేవేంద్ర, రామమద్దిలేటి, కాటినేని నారాయణ, కేవీ మధు, రాము, నాగరాజు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## విద్యుత్ టారీఫ్‌పై చర్చించేందుకు అవకాశం ఇవ్వండి

**పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకుల డిమాండ్**

**కల్లూరు డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి):** విద్యుత్ టారీఫ్‌పై బహిరంగ విచారణలో పాల్గొనేందుకు పట్టణ పౌర సంక్షేమ సంఘం బృందానికి అవకాశం ఇవ్వాలని ఆ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పట్టణపౌర సంక్షేమ సంఘం నాయకుల బృందం ఏపీఈఆర్సీకి వినతి పత్రం అందజేశారు. 24 గంటల్లో మూడు రకాల విద్యుత్ చార్జీలు విధిం చేందుకు ఏర్పాటు చేస్తున్న స్మార్ట్‌మీటర్లను పట్టణపౌర సంక్షేమం నాయకులు వ్యతిరేకించారు. డిస్కంలు 2025-26 ఆర్థిక సంవత్సరానికి విద్యుత్ టారీఫ్‌పై జనవరి 10న విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జరిగే బహిరంగ విచారణలో పాల్గొనేందుకు అభ్యంతరాలను తెలిపేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. అయితే పట్టణపౌర సంక్షేమ సంఘం తరపున ఒకరికి అవకాశం ఇస్తామని ఏపీఈఆర్సీ సెక్రటరి కృష్ణయ్య తెలిపారు. కార్యక్రమంలో ఇరిగినేని పుల్లారెడ్డి, వెంకటేశ్వర్లు, కే.గోపినాథ్ పాల్గొన్నారు.

## ఖాతాదారులు ఈకేవైసీ చేయించుకోవాలి

**కర్నూలు కల్చరల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి):** కర్నూలు మండల పరిధిలోని మామిదాలపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఖాతా దారులు సంబంధిత సచివాలయాల సిబ్బందితో ఈకేవైసీకి చేయించుకో వాలని కర్నూలు మండలం, మామిదాలపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పర్సన్ ఇన్‌చార్జి సి.విజయభారతి, సంఘం సీఈఓ వి.రామకృష్ణ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈకేవైసీ చేయించుకోవడం వల్ల ప్రభుత్వాలు అందించే రాయితీలు రైతులు పొంద వచ్చని వారు తెలిపారు. సహకార సంఘాల అభివృద్ధికి కేంద్రం తోడ్పాటు ఇస్తోందని తెలిపారు.

**కర్నూలు అగ్రికల్చర్:** కల్లూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం పరిధిలోని రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని కల్లూరు సంఘం పర్సన్ ఇన్‌చార్జి నాగరమణయ్య కోరారు. శనివారం సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డుతూ ప్రతి రైతు ఈకేవైసీ చేయించుకోవాలని ఈ విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం చూపవద్దన్నారు. ఈ సమావేశంలో సంఘం సీఈవో పుల్లయ్య పాల్గొన్నారు.

## విద్యుత్ చార్జీల పెంపు పాపం జగన్‌దే: ఎమ్మెల్యే

**కర్నూలు రూరల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి):** విద్యుత్ చార్జీల పెంపు పాపం వైఎస్ జగన్‌రెడ్డిదేనని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచిందని వైసీపీ చేస్తున్న ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. గత ప్రభుత్వ విధ్వంస పాలన, ప్రజావ్యతిరేక విధానాలను అవలంబించిన జగన్ ట్రూ అప్, సర్దుబాటు చార్జీల పేరుతో పేద ప్రజలపై మోయలేని భారం వేయడం నిజంకాదా అని ఎమ్మెల్యే సూటిగా ప్రశ్నిం చారు. విద్యుత్ సంస్కరణల పేరుతో స్మార్టు మీటర్లు, రైతుల వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెట్టి అన్ని వర్గాల ప్రజలపై విద్యుత్ చార్జీలు పెంచిన ఘనత జగన్‌రెడ్డిదేనని అన్నారు.

## రేపు అతిథి అధ్యాపక పోస్టుకు ఇంటర్వ్యూ

**కోడుమూరు రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి):** కోడుమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపకుల కోసం ఈనెల 30న ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ కళాశాలలో జువాలజీ సబ్జెక్టు బోధనకు అతిథి అధ్యా పకుల నియామకం జరుగనున్నట్లు తెలిపారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు సంబంధిత విభాగంలో కనీసం 50 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణత సాధించి ఉండాలని, ఇంటర్వ్యూకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

## ఎంపీడీవోపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న అధికారులు

**ఓర్వకల్లు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి):** అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపీడీవో జవహర్ బాబుపై దాడి చేసిన వైసీపీ నాయకులను అరెస్టు చేయాలని అధికారులు డిమాండ్ చేశారు. శనివారం ఓర్వకల్లులోని ఎంపీ డీవో కార్యాలయం ఎదురుగా నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఓర్వకల్లు ఎంపీడీవో శ్రీనివాసులు మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న జవహర్‌బాబుపై వైసీపీ నాయకులు భౌతికదాడికి పాల్పడడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ సుబ్బరాయుడు, ఏపీవో కుమార సాయినాథ్, ఆర్డబ్ల్యూఎస్ జేఈ శ్రీనివాసులు, ఆయా శాఖ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**కల్లూరు:** అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపీడీఓ జవహర్ బాబుపై జరిగిన దాడిని వ్యతిరేకిస్తూ కల్లూరు ఎంపీడీఓ జి.నాగేశాచలరెడ్డి ఆధ్వర్యం లో శనివారం నల్ల బాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఈఓ ఆర్డీ, పంచాయతీ సెక్రటరీలు, ఎస్‌ఆర్ ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

**కర్నూలు కలెక్టరేట్:** అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపీడీవో జవహర్ బాబుపై జరిగిన దాడిని ఆంధ్రప్రదేశ్ పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంటు హేమంత్ కుమార్ రెడ్డి ఖండించారు. ఎంపీడీవోపై దాడి చేసిన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు.



# పైపులైన్ లీకేజీ

● బురదమయంగా రహదారి
● ఇబ్బందుల్లో రైతులు, ప్రజలు

**కోడుమూరు రూరల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి):** మండలంలోని బైనదొడ్డి గ్రామంలో తాగునీటి పథకం సంబంధించిన బోరు పైపులైన్ లీకేజీ కావడంతో రహదారి బురదమయంగా మారింది. దీంతో రైతులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామంలో సుమారు 600 జనాభా ఉంది. ప్రజల తాగునీటి అవసరాల కొరకు శ్మశాన దారిలో బోరు వేసి పైప్‌లైన్ వేశారు. స్థానిక సుంకులమ్మ గుడి సమీపంలో రెండు మినీ ట్యాంకులు ఏర్పాటు చేశారు. గ్రామప్రజలంతా అక్కడి నుంచే నీరు పట్టుకుని తీసుకెళతారు. అయితే పైప్‌లైన్ ఒకచోట పగిలిపోయి నీరు వృథా అవుతోంది. స్టార్టర్ ఆన్ చేసినంతసేపు నీరు లీకై దారిపై ప్రవహిస్తోంది. దీంతో నిత్యం బురదగా ఉంటోంది. అటువైపు పొలాలకు వెళ్లే కూలీలు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతేగాకుండా శ్మశానం వెళ్లే సమయంలో తిప్పలు తప్పడం లేదు. అధికారులు స్పందించి పైపులైన్‌కు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



బురదగా మారిన పొలాల రస్తా



లీకైజీ అయిన పైపులైన్

**ప్రమాదకరంగా విద్యుత్ వైరు:** బైనదొడ్డి తాగునీటి పథకానికి వినియోగించిన విద్యుత్ సర్వీసు వైరు నేలపై ఉంది. కొన్నిచోట్ల కంపచెట్ల కొమ్మలు, మరికొన్ని చోట్ల కట్టెలకు కట్టారు. అక్కడక్కడా తెగిన జాయింట్లను కలిపి విద్యుత్‌వైరుకు ప్లాస్టర్ వేశారు. దీంతో ప్రమాదం పొంచి ఉంది.

**నడిచి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది..**



రోజూ పొలం పనులకు వెళ్తున్నాం. పైప్‌లైన్ పగలడంతో నీళ్లు బయ టకు వచ్చి బురదమయంగా మారింది. మరో మార్గం లేక బురదలో నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి. అంతేగాకుండా తాగునీరు కలుషితం అవుతోంది. లీకేజీ అరికట్టాలి. అలాగే కరెంటు తీగలు నేలపై ఉన్నాయి. దీంతో తీగలు కట్ అయ్యే అవకాశం ఉంది. పొరపాటున కాలు పెడితే ప్రాణాలకే ప్రమాదం. స్తంభాలు ఏర్పాటు చేసి తీగలు పైకి కట్టాలి.
- ఉరుకుందమ్మ, బైనదొడ్డి

## జాతీయ రహదారి విస్తరణకు సహకరించాలి

**జాయింట్ కలెక్టర్ బి. నవ్య**

**కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి):** దామోదరం సంజీవయ్య (చెక్‌పోస్టు) నుంచి నందికొట్కూరు రోడ్డు వైపు శ్రీసాయి గార్డెన్స్ వరకు జాతీయ రహదారి విస్తరణకు ప్రజలు సహకరించాలని జాయింట్ కలెక్టర్ బి.నవ్య, నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు కోరారు. శనివారం చెక్‌పోస్టు సమీపంలోని సంతోష్ ఫంక్షన్‌లో రహదారి విస్తరణలో భూమి కోల్పోనున్న బాధితులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్ ప్రకారం 120 అడుగుల రహదారి నిర్మించాలని ప్రతిపాదనలు ఉన్నాయని, ఏవైనా అభ్యంతరాలు, మార్పు చేర్పులు, అభిప్రాయాలు ఉంటే తెలపాలని బాధి తులను కోరారు. బాధితుల అభిప్రాయాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని, త్వరలో మరోసారి సమావేశం నిర్వహిస్తామని అన్నారు. భూమి కోల్పోయిన బాధితులకు న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో జాతీయ రహదారుల ఈఈ శంకర్ రెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

## సభను విజయవంతం చేయండి'

**కర్నూలు కల్చరల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి):** వీహెచ్‌పీ ఆధ్వర్యంలో జనవరి 5న విజయవాడలో నిర్వహిస్తున్న 'హైందవ శంఖారావం' సభను విజయవంతం చేయాలని వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి మాళిగి భానుప్రకాశ్ శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. హైందవ శంఖారావం ప్రాంతీయ కమిటీ వారు కేంద్ర ప్రభుత్వంలోని రైల్వే మంత్రిత్వ శాఖతో సంప్రదించి, విజ యవాడలో జరిగే ఈ సభకు రాష్ట్రం నలుమూలల నుంచి 15 ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేశారని తెలిపారు. కర్నూలు నగరం నుంచి ఒక ప్రత్యేక రైలు జనవరి 4న రాత్రి బయల్దేరుతుందని, 18 బోగీలు, 72 స్లీపర్ సీట్లతో ఎలాంటి ఇబ్బంది లేకుండా హైందవ శంఖారావం సభకు వచ్చేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈ సభకు వచ్చే వారు చంద్రశేఖర్ 6300206402, ఈపూరి నాగరాజు 9133544689 సెల్ నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

## గోదాములకు మహర్దశ కల్పిస్తాం

● లక్ష మెట్రిక్ టన్నుల నిత్యావసరాల నిల్వకు కార్యాచరణ
● రీజనల్ మేనేజర్ జాకీర్‌హుశేన్

**కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్ర వ్యాప్తంగా రాష్ట్ర గిడ్డంగుల సంస్థకు మహర్దశ కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, రాష్ట్రంలోని గోదాముల్లో బియ్యం, తదితర ఆహారోత్పత్తులను నిల్వ చేసేందుకు ఎస్‌డబ్ల్యూసీ సంస్థ ఎండీ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశారని రీజనల్ మేనేజర్ జాకీర్ హుశేన్ తెలిపారు. శనివారం కర్నూలు నగరంలోని మౌర్యఇన్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ అభివృద్ధికి తీసుకున్న చర్యలను వివరించారు. ఎస్‌డబ్ల్యూసీ సంస్థ కార్యకలాపాలను విస్తృతం చేస్తున్నామని, ఇందులో భాగంగా గోదాములను పటిష్టం చేసి వాటి సామర్థ్యం మేరకు పంట ఉత్పత్తులను నిల్వ చేసేందుకు చర్యలు చేపట్టామని అన్నారు. ఇటీవల ఎస్‌డబ్ల్యూసీ గోదాముల్లో అక్రమాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయని, వాటిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యులైన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో ఎస్‌డబ్ల్యూసీ సంస్థ కార్యాలయంలో పని చేస్తున్న మేనేజర్ నాగరాజు పాల్గొన్నారు.

# వాడీవేడిగా సమావేశం

● అక్రమ లేఅవుట్‌పై చర్యలు తీసుకోవాలి
● పనుల నిర్వహణపై సమాచారం ఇవ్వకపోతే ఎలా?

**గూడూరు డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి):** గూడూరు నగర పంచాయతీ బడ్జెట్ సమావేశం వాడీవేడిగా సాగింది. శనివారం గూడూరు నగర పంచాయతీ కార్యాలయంలో చైర్మన్ జె వెంకటేశ్వర్లు అధ్యక్షతన కమిషనర్ నాగరాజు బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ కౌన్సిలర్ రేమట సురేష్, కో ఆప్షన్ మెంబరు రామాంజనేయులు మాట్లాడుతూ నగర పంచాయతీ ఆదాయం ఎంత.. ప్రభుత్వం నుంచి మంజూరు అవుతున్న నిధులు ఎంత .. ఏయే పనులకు ఎంతెంత ఖర్చు చేస్తున్నారు వాటి వివరాలు ఇవ్వాలని కోరారు. అభివృద్ధి కోసం వచ్చిన నిధులను ఖర్చు చేయలేని దుస్థితిలో పాలక వర్గం, అధికారులు ఉన్నారని ధ్వజమెత్తారు. అలాగే అక్రమ లేఅవుట్లు ఇష్టారాజ్యం వేస్తుంటే ఏం చేస్తు న్నారని ప్రశ్నించారు. తక్షణం అధికారులు అక్రమ లేఅవుట్లు వేసిన వారిని నోటీసులు ఇవ్వాలన్నారు. ఆదాయ వనరులు, ప్రభుత్వ నిధులు, ఖర్చుల వివరాలు వచ్చే సమావేశం నాటికి అందిస్తామని, అలాగే అక్రమ లేఅవు ట్లపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ నాగరాజు చెప్పారు. అనంతరం కౌన్సిలర్ దస్తగిరి మాట్లాడుతూ వార్డుల్లో చేపడుతున్న పనులపై కనీసం సమాచారం ఇవ్వారా .. కౌన్సిలర్లకు ఇచ్చే గౌరవం ఇదేనా అంటూ ప్రశ్నిం చారు. ఇక ముందు కౌన్సిలర్లకు సమాచారం అందిస్తామని కమిషనర్ చెప్పారు. నగర పంచాయతీ నూతన భవనాన్ని త్వరగా పూర్తి చేయాలని కౌన్సిలర్లు కోరారు. ఈసమావేశంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్లు పీఎస్ అస్లాం, లక్షన్న, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.



అధికారులను ప్రశ్నిస్తున్న టీడీపీ కౌన్సిలర్ రేమట సురేష్

# పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి: కమిషనర్

**కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి):** విద్యార్థులకు చదువుతోపాటు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై పాఠశాలల స్థాయి నుంచే ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని నగర కమిషనర్ రవీంద్ర బాబు అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ టౌన్‌మోడల్ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి పాఠశాల యజమాన్య కమిటీ శిక్షణ కార్యక్ర మం డీఈవో శ్యామ్యూల్‌పాల్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు విద్య, క్రమశిక్షణ, వారి ప్రవర్తనల పట్ల ఉపాధ్యాయులు నిఘా ఉంచి ఎప్పటికప్పుడు వారిని అప్రమత్తం చేయాలని సూచించారు. డీఈవో శామ్యూల్ పాల్ మాట్లాడుతూ మండల రీసోర్స్‌పర్సన్లు శిక్షణా తరగతులను వినియోగించుకోవాలని, మండల స్థాయిలో మీరు తిరిగి పాఠశాల యజమాన్య కమిటీ సభ్యులకు ఉపాధ్యాయులకు శిక్షణ ద్వారా అందించాలని సూచించారు. కార్యక్రమంలో కేఆర్‌పీ విజయభాస్కర్, జిల్లా రీసోర్స్ పర్సన్ వినోద్, విజయకుమారి, కమ్యూనిటీ మొబైలేజేషన్ ఆఫీసర్ శివశంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ రవీంద్రబాబు

## కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

**నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్**



దేవదాయశాఖ మంత్రికి వినతిపత్రం ఇస్తున్న డైరెక్టర్

**కర్నూలు అర్బన్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి):** దేవాలయాల్లో కాంట్రాక్టు పద్ధతిన పని చేస్తున్న ఉద్యోగులను, కరకట్టలో పనిచేస్తున్న క్షురకులను రెగ్యులర్ చేయాలని నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పాలక వీటి విజయకుమార్ డిమాండ్ చేశారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రతి జిల్లాకు ఓ సంగీత రెసిడె న్షియల్ కళాశాలను ఏర్పాటు చేయాలని, దేవాలయాల్లో పని చేస్తున్న నాయీబ్రాహ్మణ కుటుంబానికి రెండు సెంట్ల స్థలం ఇవ్వాలని కోరారు. స్పందించిన మంత్రి సమస్యలను సీఎం చంద్ర బాబు దృష్టి తీసుకెళ్తామని చెప్పారు. నాయీబ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు ఎం.ఆదినారాయణ, కడియా కొండన్న పాల్గొన్నారు.

## బోర్లకు మరమ్మతులు చేయండి

**సి.బెళగల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి):** గ్రామాల్లోని బోర్లకు మరమ్మతులు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసులు గుండ్రేవుల, తిమ్మనదొడ్డి, సంగాల గ్రామాల సర్పంచులకు ఆదేశించారు. శనివారం ఆయన మాట్లాడుతూ తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంక్‌లు, కొళా యిలు దగ్గర పరిసరాలను శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. డీఈ వెంట ఏఈ గోనెనాయక్, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

## విద్యుత్ బిల్లులు చెల్లించండి

**సి.బెళగల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి):** విద్యుత్ బిల్లులను సకాలంలో చెల్లించాలని ఏడీఏ జేసన్, ఏఈ సుమంత్ వినియోదారులకు సూచించారు. శనివారం మండలంలోని కొత్తకోట, గుండ్రే వుల, పోలకల్లు గ్రామాల్లో వారు పర్యటిచారు. మండలంలోని పోలకల్లు గ్రామంలో రైతులు, ప్రజలతో వారు సమావేశమయ్యారు. విద్యుత్ బకాయిలు చెల్లించకపోతే కనెక్షన్లు తొలగిస్తామని హెచ్చరించారు.

## ఓరియన్ పాఠశాలలో కార్నివాల్

**కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి):** స్థానిక సాయినాథ్ నగర్‌లోని దీ ఓరియన్ స్కూల్‌లో ఇంగ్లీష్ కార్నివాల్ (ఆంగ్ల ఉత్సవ్ వేడుకలు) శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అసోసియేషన్ ప్రొఫెసర్ ఆఫ్ ఇంగ్లీష్, ప్రిన్సిపాల్ ఆఫ్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, పాణ్యం డా.ఎం.ఫరీదా బేగం, గౌరవ అతిథిగా జి.పుల్లయ్య ఇంజనీరింగ్ కాలేజీ, టెక్నాలజీ హెచ్‌వోడీ ఆఫ్ ఇంగ్లీష బి.శశికుమార్ హాజరయ్యారు. ఈసందర్భంగా వారు ఆంగ్ల బాష ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. కరస్పాండెంట్ పీవీ రమణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

## రుణాలను సకాలంలో చెల్లించాలి

**సి.బెళగల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి):** పొదుపు మహిళలు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని ఏపీఎం రమేష్ అన్నారు. శనివారం మండల వెలుగు కార్యాలయంలో మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి అధ్యక్షతన పొదుపు మహిళలతో సమావేశం నిర్వహించారు. ఏపీఎం రమేష్ మాట్లాడుతూ పొదుపు మహిళలు తమ పిల్లలను బాగా చదివించాలన్నారు. సీసీలు రాముడు, బాషా, మదు, గుండమయ్య, గోవింద బుక్‌కీపర్లు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

## ఉర్దూ సాహిత్యంపై దృష్టి సారించాలి: ప్రిన్సిపాల్

**కర్నూలు అర్బన్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి):** ఉర్దూ సాహిత్యంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని కేవీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్ అన్నారు. శనివారం కేవీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ దేవికారాణి ఆధ్వర్యంలో ఉర్దూ కవి మీర్జా గాలిబ్ జయంతి సందర్భంగా పలువురిని సన్మానించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కె.బషీర్, అరబిక్ లెక్చరర్లు ఖాజా మొద్దీన్, నజయాతుల్లా, విద్యార్థులు పాల్గొన్నారు.

## సభ్యత్వ నమోదుతో కార్యకర్తలకు న్యాయం

**గూడూరు డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి):** టీడీపీ సభ్యత్వ నమోదుతో కార్యకర్తలకు న్యాయం జరుగుతుందని మాజీ వైస్ చైర్మన్ కురుకుంద రామాంజనేయులు అన్నారు. శనివారం గూడూరులోని ఆయా కాలనీల్లో టీడీపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా కె రామాంజనే యులు మాట్లాడుతూ పేదల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రేమట వెంకటేశ్వర్లు, స్రుజన్, పౌలు, తెలుగు శ్రీను, కూరగాయల చాంద్ బాషా పాల్గొన్నారు.

## ఘనంగా విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

**ఓర్వకల్లు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి):** ఓర్వకల్లులోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఐక్యవేదిక ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా డీఎస్పీ మహబూబ్ బాషా, ఎంపీపీ తిప్పన్న, మదర్ థెరిస్సా డెవలప్‌మెంట్ కో-ఆర్డినేటర్, ఎంపీడీవో శ్రీనివాసులు హాజరయ్యారు. విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి వారు వివరించారు. అనంతరం విభిన్న ప్రతిభావంతులను అధికారులు సన్మానించారు.

## భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

**ఓర్వకల్లు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి):** భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని తహసీల్దార్ విద్యాసా గర్ అన్నారు. మండలంలోని సోమయాజులపల్లె పంచాయతీలో శని వారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. భూ సమస్యలపై అర్జీలు ఇస్తే.. పరిశీలించి 45 రోజుల్లోగా పరిష్కారం చూపుతామన్నారు. అనంతరం పలువురి నుంచి అర్జీలను స్వీకరించారు. సర్పంచ్ జయమ్మ, రైతులు కాకి దేవేంద్ర, రామమద్దిలేటి, ఆకుల మహేష్, రామచంద్రుడు, నాగమల్లేష్ పాల్గొన్నారు.

## కల్వర్టుల పునర్నిర్మాణానికి చర్యలు: కమిషనర్

**కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి):** నగరంలో శిథిలా వస్థకు చేరిన కల్వర్టుల పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన బుధవా రపేటలోని పలు కాలనీల్లో పర్యటించి, స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. కొళాయి కనెక్షన్ల కోసం రహదారులపై తీసిన గుంతలపై ప్యాచ్‌వర్క్ పనులు చేపట్టాలన్నారు. క్రమం తప్పకుండా ప్రతి మురుగు కాలువలో పూడికతీత పనులు చేపట్టాలన్నారు. అనంతరం కలెక్టరేట్‌లోని అన్న క్యాంటీన్‌ను పరిశీలించి ఆహార రుచి, పరిసరాల శుభ్రతపై ఆరా తీశారు. ఆయన వెంట ప్రజారోగ్య అధికారి డాక్టర్ కే.విశ్వేశ్వరరెడ్డి, టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ అంజాద్‌బాషా, ట్రైనీజే ఏఈ రామోహన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్ బాబు ఉన్నారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్

## గీతాంజలి నర్సింగ్ కళాశాల విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబర్చిన సుశీల, అనుకృష్ణ, మాధవి, శ్రీలేఖ

**కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి):** నగరంలోని గాయత్రీ ఎస్టేట్‌లోని గీతాంజలి నర్సింగ్ కళాశాలలో 2023-24 విద్యాసంవత్సరానికి రెండో సెమిస్టర్, నాలుగో సెమిస్టర్‌లో గీతాంజలి నర్సింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. నర్సింగ్ విద్యార్థులు 27 మంది డిస్టింక్షన్, 55 మంది ఫస్ట్ క్లాస్, 10 మంది సెకండ్ క్లాస్‌లో విజయం సాధించారు. కళాశాల ఉత్తీర్ణత శాతం 94గా నిలిచింది. కాలేజీ టాపర్లుగా సుశీల (కేరళ), అనుకృష్ణ (కేరళ), శ్రీలేఖ, మాధవి, అనూష, అరుణలు నిలిచారు. ప్రతిభ కనబరిచిన నర్సింగ్ విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ పెరుగు విజయవర్ధన్ రెడ్డి, ప్రిన్సిపాల్ వసంతకుమారి అభినందించారు.

## మండల గ్రాంటు నిధులతో గ్రామాల అభివృద్ధి



మాట్లాడుతున్న కల్లూరు ఎంపీపీ శారద

**కల్లూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి):** మండల గ్రాంటు నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ బి.శారద అన్నారు. శనివారం కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీపీ ఆఫీసులో ఎంపీడీఓ జి.నాగేశాచలరెడ్డితో కలిసి ఎంపిటీసీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ బి.శారద మాట్లాడుతూ మండల గ్రాంటు కింద గ్రామ పంచాయతీల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. ఎంపీటీసీలు మండల గ్రాంటుతో గ్రామాల్లో గుర్తించిన పనులను ఎలా చేపట్టాలని ఎంపీడీఓ దిశానిర్దేశం చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు కాగానే గుర్తించిన పనులు చేయాల్సి ఉందన్నారు. అనంతరం జనవరి 3న కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్న సర్వసభ్య సమావేశాన్ని జయ ప్రదం చేయాలని ఎంపీడీఓ ఎంపీటీసీలకు పిలుపునిచ్చారు. కార్యక్ర మంలో సర్పంచు బి.మద్దిలేటి, ఎంపీటీసీలు మునిస్వామి, చంద్రశేఖర్‌రెడ్డి, ఏవీ రమణ, లక్ష్మన్న నాయకుడు పెద్ద ఈశ్వరయ్య పాల్గొన్నారు.

## గ్రామాలకు తాగునీరు అందించండి: ఆర్డీవో

**ఓర్వకల్లు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి):** కాల్వబుగ్గ వాటర్ స్కీం ద్వారా గ్రామాలకు తాగునీరు అందించాలని ఆర్డీవో సందీప్ కుమార్ అన్నారు. శనివారం కాల్వబుగ్గ వాటర్‌స్కీంను ఆయన తనిఖీ చేశారు. ఈ స్కీం ద్వారా కాల్వ, కాల్వబుగ్గ, సోమయాజులపల్లె, ఓర్వకల్లు, హుశేనాపురం, తిప్పాయపల్లె, ఎన్.కొంతలపాడు గ్రామాలకు తాగునీటి సరఫరా జరుగు తుందన్నారు. ఆయన వెంట ఎంపీడీవో శ్రీనివాసులు, తహసీల్దార్ విద్యా సాగర్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీనివాసులు, లోకేశ్వరి పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో శని త్రయోదశి వేడుక



శనీశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

**కర్నూలు కల్చరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి):** నగరంలోని సంకల్ బాగ్‌లోగల శనీశ్వరస్వామి ఆలయంలో శనివారం శని త్రయోదశి వేడు కను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి భక్తులు తమ స్వహస్తాలత స్వామివారికి తైలాభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకుడు రంగ స్వామి స్వామివారి మూలమూర్తికి పంచామృతా భిషేకాలు, కుంకుమాభిషేకాలు నిర్వహించారు. కార్యక్ర మంలో దేవస్థానం కమిటీ సభ్యుడు డీవీ రమణ అధ్యక్షతన కమిటీ సభ్యులు ఇల్లూరు రమణ, సింహాద్రి రమేశ్, డి. జగదీష్, ఎస్‌జీ మహబ లేష్, భక్తులు పాల్గొన్నారు.

## యువజన జిల్లా మహాసభను విజయవంతం చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

**దేవనకొండ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి):** కర్నూలులో జరిగే ఏఐవైఎఫ్ 16వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా సహాయ కార్యదర్శి రమేష్ ,మండల అధ్యక్ష,కార్యదర్శులు రవికుమార్, రామాంజినేయలు అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో జిల్లా మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. 30,31న కర్నూలులో జరిగే జిల్లా మహాసభలను పాల్గొన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో రాహుల్, నరేష్, మహబుబ్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

## జీవో 75ను రద్దు చేయాలి



తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించిన విద్యార్థులు, ఏఐఎస్ఎఫ్ నాయకులు

**మద్దికెర, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి):** యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు జీవో.నెం.75ను రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ ఉపాధ్యక్షుడు పులింద్ర శ్రీకాంత్ అన్నారు. శనివారం మద్దికెర గ్రామంలో ప్రధాన బస్టాండు నుంచి ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయం ముట్టడించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంటు, వసతి దీవెన బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ హుశేన్ సాహెబ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు తిప్పన్న, పవన్, జశ్వంత్, రాము, వేణు, అనిల్, జగన్ తదితరులు ఉన్నారు.

## కుక్కల దాడిలో రెండు పొట్టేళ్లు మృతి



మృతి చెందిన పొట్టేళ్లు

**మద్దికెర, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని పెరవలి గ్రామంలో శనివారం గొర్రెల కాపరి వీరన్న చెందిన పొట్టేళ్లపై వీధి కుక్కలు దాడి చేయడంతో రెండు పొట్టేళ్లు మృతి చెందాయి. వీరన్న ఇతర ప్రాంతాల నుంచి పొట్టేళ్లను, గొర్రెలను తెచ్చుకుని వాటిని పెంచి పోషించి జీవనం సాగిస్తుంటాడు. రోజు మాదిరిగానే ఇంటి ముందు ఉన్న షెడ్డులో గొర్రెలను, పొట్టేళ్లను కట్టేసి ఉంచాడు. అయితే.. వీధి కుక్కలు ఒకేసారిగా వాటిపై దాడి చేయడంతో రెండు పొట్టేళ్లు చనిపోయాయి. దీంతో రూ.30వేలు నష్టం వాటిల్లిందని తెలిపారు.

## 'దరఖాస్తు చేసుకోండి'

**మద్దికెర, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని చిరు వ్యాపారాలు చేసుకునే వారు కోళ్ల పెంపకంపై అవగాహన ఉన్న వారు జీవనోపాధి కోసం దరఖాస్తు చేసుకోండి పశువైద్యాధికారి కృష్ణ నాయక్ అన్నారు. శనివారం మండలంలోని ఎం.అగ్రహారం గ్రామంలో అఖిల భారత పశుగణన ఇంటింటి సర్వేను పరిశీలించారు. అలాగే కోళ్ల షెడ్‌ను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 8,340 ఇళ్లు ఉండగా.. 7,117 ఇళ్లను సర్వే చేయడం జరిగిందన్నారు. దాదాపు 86 శాతం పూర్తి చేశామని తెలిపారు. రైతులకు ప్రభుత్వం గోకుల షెడ్లను మంజూరు చేసిందన్నారు.

## వెల్ఫేర్ అసిస్టెంట్ల సమస్యల పరిష్కారానికి పోరాడుతాం



వెల్ఫేర్ అసిస్టెంట్ల జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన పులిశేఖర్

**తుగ్గలి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) :** వెల్ఫేర్ అసిస్టెంట్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పోరాడుతామని జిల్లా వెల్ఫేర్ అసిస్టెంట్ల యూనియన్ జిల్లా అధ్యక్షుడు పులిశేఖర్ అన్నారు. శనివారం మండల పరిధిలోని ఎద్దులదొడ్డి సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న పులిశేఖర్‌ను జిల్లాలోని అన్ని సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు కలిసి ఏకగ్రీవంగా యూనియన్ అధ్యక్షుడుగా పులిశేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎద్దులదొడ్డి సర్పంచ్ విజయుడు, శ్రీనివాసులగౌడు పులిశేఖర్‌ను అభినందించారు.

## విరాళాలు అందజేత



విరాళం అందిస్తున్న దాతలు

**మద్దికెర, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని పెరవలి గ్రామంలో శ్రీరంగనాథ స్వామి దేవాలయంలో తూర్పు రాజగోపురం నిర్మాణం కోసం ముందుభాగంలో ఉన్న స్థలం కొనుగోలుకు దేవాలయం వారు చేపట్టిన విరాళాలకు గ్రామానికి చెందిన లింగం వేణుగోపాల్ రెడ్డి, పావనిలు రూ.20,357, పులిగొమ్మి గ్రామానికి చెందిన పులిగుమ్మి రంగస్వామి కుమారుడు గిరీష్ రూ.75వేలు, మూలింటి జగన్నాథరెడ్డి రూ.20,116, ఆలయ ఈవో వీరయ్యకు ప్రధాన అర్చకులు రంగస్వామికి శనివారం విరాళాలును అందజేశారు.

## దేశ సంపద కొందరి చేతుల్లోనే

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామచంద్రయ్య



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామచంద్రయ్య

**మద్దికెర, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి):** దేశ సంపద కొందరి చేతుల్లోనే ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి. రామచంద్రయ్య అన్నారు. శనివారం సాయంత్రం మండలంలోని ఎం. అగ్రహారం గ్రామంలో దివంగత సీపీఐ జిల్లానాయకుడు హనుమప్ప స్థూప ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మండల సీపీఐ కార్యదర్శి నాగరాజు అధ్యక్షతన జరిగిన సభలో రామచంద్రయ్య మాట్లాడుతూ మండలంలో సీపీఐ హనుమప్ప చేసిన సేవలు ఎన్నటికీ మరువలేనివన్నారు. హనుమప్ప 20ఏళ్ల పాటు సీపీఐలో పలు పదవులను నిర్వహించారని అన్నారు. ఆయన పోరాట పటిమ ఎన్నటికీ మరువలేమన్నారు. దేశంలో సంపద కేంద్రీకరణ పెరగడంతో పేదరికం ఎక్కువైందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మల్లికార్జున యాదవ్, జిల్లా టీడీపీ కార్యదర్శి గూడూరు ధనుంజయుడు, సీపీఐ మాజీ జిల్లా కార్యదర్శి భీమలింగప్ప, సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నబీరసూల్, మాజీ ఎంపీటీసీ శివశంకర్, మాజీ మండల సీపీఐ కార్యదర్శి డా.వలిసాహహెబ్, రామాంజులు, కోదండరాముడు, రంగస్వామి తదితరులు ఉన్నారు.

# జగన్ అవినీతి పాపమే విద్యుత్ చార్జీల పెంపు

● ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

**పత్తికొండ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి):** ఐదేళ్లపాలనలో 10 సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై రూ. 32వేల కోట్ల విద్యుత్ భారం మోపిన ఘనత అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ఆరోపించారు. శనివారం ఆయన మాట్లాడుతూ జగన్‌రెడ్డి తన ఐదేళ్లపాలనలో రాష్ట్రంలో అందుబాటులో ప్లాంట్ల ద్వారా పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేయడంలో విఫలమయ్యారని, దీనికితోడు విద్యుత్‌ను ఉత్పత్తి చేసేందుకు అవసరమైన పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేయకపోవడంతో రాష్ట్రంలో విద్యుత్ కొరత ఏర్పడి విద్యుత్‌ను కొనుగోలు చేయాల్సి వచ్చిందన్నారు. తక్కువ ధరకు విద్యుత్‌ను అందించే కంపెనీల ద్వారా కాకుండా ఎక్కువ ధరకు విద్యుత్‌ను అమ్మే సంస్థల నుంచి విద్యుత్‌ను కొనుగోలు చేసి కోట్ల రూపాయల భారం ప్రజలనెత్తిన రుద్దాడన్నారు. కొత్తప్లాంట్ల నిర్మాణంపేరిట ట్రాన్స్‌కోపై జగన్‌వేల కోట్లు అప్పులుచేశాడే తప్ప ఎక్కడా ప్లాంట్లను నిర్మించలేదన్నారు. విద్యుత్‌పేరిట అప్పులు. అప్పులకు వడ్డీలు ఇతరత్రా ఖర్చులు అన్ని కలుపుకుని జగన్‌ప్రభుత్వం రూ. 1,29,503కోట్లు ఖర్చులుచేసి ఆ భారాన్ని ప్రజలనెత్తిన వేశాడని గుర్తుచేశారు. విద్యుత్‌చార్జీల పెంపు టీడీపీదేనని జగన్ ధర్నాలకు పిలుపునివ్వడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు.

### విద్యుత్ చార్జీలు పెంచిన ఘనత జగన్ ప్రభుత్వానిదే



మాట్లాడుతున్న మీనాక్షీనాయుడు

**ఆలూరు, డిసెంబరు28 (ఆంధ్రజ్యోతి) :** విద్యుత్ చార్జీల పెంపు గత వేసీపీ ప్రభుత్వంలో జరిగిందని అలాంటప్పుడు వైసీపీ అధినేత విద్యుత్ చార్జీలు తగ్గించాలని రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేయించడం విడ్డూరంగా ఉందని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జీ వీరభద్ర గౌడ్ అన్నారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా ఉన్న జగన్మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో 9సార్లుచార్జీలు పెంచి ప్రజలపై భారం మోపారని గుర్తు చేశారు. రాష్ట్రంలో కమిషన్‌ల కోసం తక్కువ ధరలకు రుద్ర శాఖలో విద్యుత్ కొనుగోలు చేశారన్నారు. విద్యుత్ ప్లాంట్‌లు కూడా ఏర్పాటు చేయలేదని ఆరోపించారు. దీంతో జగన్మోహన్ రెడ్డి చేసిన తప్పిదాల వల్ల విద్యుత్ శాఖపై అధిక భారం పడిందన్నారు. విద్యుత్ ప్లాంట్‌లు ఏర్పాటు చేయకపోవడం వల్ల నిరుద్యోగ సమస్య ఏర్పడిందన్నారు. ప్రజలకు మేలు చేస్తున్న కూటమి ప్రభుత్వంపై వైసీపీ నాయకులు ఆరోపణలు చేస్తూ దీపాలతో నిరసనలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ఆలూరులో కూడా సోలార్ ప్రాజెక్టు ఏర్పాటుకు సహకరిసామన్నారు. రాష్ట్రంలో ఎలాంటి విద్యుత్ కోతలు లేవన్నారు. అనవసరంగా ప్రభుత్వంపై బురద జల్లె కార్యక్రమాలు మానుకోవాలన్నారు. సమావేశంలో ఆలూరు బ్రాంచ్ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మెన్ నగర డోణ కిష్టప్ప, మొలగవల్లి సర్పంచ్ మోహన్ రాజ్, మండల కన్వీనర్ అశోక్, నాయకులు రాంనాథ్ యాదవ్, నాయకులు మల్లయ్య, తిమ్మయ్య, నేమెకల్ రవి, కొమ్ము రామాంజినేయులు, గూళ్యం రామాంజినేయులు, కొమ్ము రాజు, కిట్టు, కేశన్న, అగ్రహారం ఈరన్న పాల్గొన్నారు.




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ ఆలూరు ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్

### విద్యుత్ భారాల పాపం జగన్ రెడ్డిదే

**ఆదోని, డిసెంబరు28 (ఆంధ్రజ్యోతి) :** వైసీపీ హయాంలో సీఎం హోదాలో పెంచిన విద్యుత్తు చార్జీలను నిరసిస్తూ ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ధర్నాలకు పిలుపును ఇవ్వడమేంటి..? అని మాజీ సీఎం జగన్‌ను మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు ప్రశ్నించారు. వైసీపీ హయాంలో పెరిగిన విద్యుత్తు చార్జీలకు నిరసగా జగన్ ధర్నాకు పిలుపును ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి విద్యుత్ చార్జీలు పెంచే ఆలోచన లేదన్నారు. కూటమి ప్రభుత్వం కరెంటు చార్జీలు పెంచబోదని స్పష్టం చేశారు. ఐదేళ్ల జగన్ పాలనలో చేసినవన్నీ ప్రజా వ్యతిరేక విధానాలేనని, ఎక్కడ చూసినా కబ్జాలు, ఇసుక మాఫియాలు, మద్యం మాఫియా ఇలా అన్ని దోచుకుని దాచేసుకున్నారని ఆరోపించారు. ఇలాంటి వారికి ప్రజలే బుద్ధిచెప్పారని, అయినా వారికి బుద్ధి రాలేదన్నారు.

# సాధారణ నిధులతోనే అభివృద్ధి పనులు

● కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యేపై వైస్ చైర్మన్ విమర్శలు



అధికారులను నిలదీస్తున్న కౌన్సిలర్లు

**ఆదోని టౌన్, డిసెంబరు28 (ఆంధ్రజ్యోతి) :** పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులు మునిసిపల్ సాధారణ నిధులతోనే చేస్తున్నారని, ఎమ్మెల్యే పార్థసారథి తెచ్చిన ప్రత్యేక నిధులేమి లేవని కౌన్సిల్ వైస్ చైర్మన్ నరసింహులు విమర్శించారు. పట్టణ అధివృద్ధి కోసం తాను నిధులు తీసుకొని వచ్చానని ఆయన చెప్పుకోవడం మానుకోవాలని అన్నారు. శనివారం చైర్ పర్సన్ వాల్మీకి శాంత అధ్యక్షతన మునిసిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. కౌన్సిలరులు వై జీ బాలాజీ, రాజేశ్వర్ రెడ్డి, పద్మ మాట్లాడుతూ గత కౌన్సిల్ సమావేశంలో కొందరు కౌన్సిలర్‌ల పేర్లను ఎమ్మెల్యే పార్థసారథి ప్రస్తావిస్తూ, ఆస్తి పన్నులు బకాయి ఉన్నారని ఆరోపిస్తూ, ప్రజలు వారిని నిలదీయాలని ఆరోపించడం సరికాదన్నారు. బకాయిలేని వారి పేరులు ప్రస్తావించి వారిని అవమాన పరచడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే సమావేశానికి వచ్చి ఉంటే ఆయననే అడిగేవారమని అన్నారు. కౌన్సిలర్ సందీష్ మాట్లాడుతూ ప్రధాన కూడళ్ళల్లో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్ ఇంతవరకూ ఒక్కసారి కూడా ఉపయోగించలేదని, తిరిగి మళ్లి కొన్ని ప్రాంతాలలో వాటిని అమర్చడానికి అజెండాలో అంశం తీసుకోని రావడం సరికాదన్నారు. వై జీ బాలాజీ మాట్లాడుతూ టైటిల్ డీడ్‌లో పేరు మార్పు చేయడానికి ఒక శాతం ఫీజు కట్టించుకోవడం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కుక్కల సంఖ్య పెరగకుండా వాటికి ప్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్లను చేయడానికి రూ. లక్షలలో ఖర్చు చేస్తున్న, కుక్కల సంఖ్య ఎలా పెరుగుతుందో అధికారులే సమాధానం చెప్పాలన్నారు. మూడు నెలల తరువాత జరిగిన సమావేశంలో అజెండాలోని అన్ని అంశాలపై పూర్తి స్థాయి చర్చ లేకుండానే సమావేశం ముగించారు. కౌన్సిల్‌లో అధిక మెజారిటీ ఉన్న వైసీపీ కౌన్సిలరులు పన్నెండు అంశాలను వాయిదా వేయించారు. సమావేశంలో కమిషనర్ కృష్ణ, ఎంఈ ఇంతియాజ్, డీఈలు గోపి, చలపతి, ఆర్‌వో నాసిర్, ఏసీపీ కృష్ణ సింగ్, టీపీవో బాల మద్దయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

# రికార్డులు మార్చేశారు

● డిప్యూటీ తహసీల్దార్‌తో బాధితులు, టీడీపీ నాయకుల వాగ్వాదం

● బాధితులకు న్యాయం చేస్తానన్న తహసీల్దార్



తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులు

**హొళగుంద, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) :** గత 20సంవత్సరాలకుపైగా సాగులో ఉన్న తమ భూములను రెవెన్యూ రికార్డులో మార్చారని హొళగుందకు చెందిన మారెమ్మ అనే మహిళ రైతు రెవెన్యూ అధికారులతో వాగ్వాదానికి దిగింది. ఆమెకు అండగా టీడీపీ నాయకులు బీజే పొంపపతి, ఎర్రిస్వామి అధికారుల తీరుపై మండిపడ్డారు. బాధితులు మాట్లాడుతూ 20సంవత్సరాలకు పైగా ఓ సర్వే నెంబరులో ఒక ఎకరా యాభై రెండు సెంట్ల భూమిలో సాగులో ఉన్నామని, అలాంటి భూమిని ఓ ప్రైవేట్ వ్యక్తి కొందరు రెవెన్యూ అధికారులతో కలిసి మరోవ్యక్తి పేరుపై ఆన్‌లైన్‌లో నమోదు చేశారని తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. దీనిపై తహసీల్దార్ సతీష్ స్పందిస్తూ గతంలో బాధితులు వేరే వ్యక్తికి చెందిన పొలంలో తమ పేర్లను భూ రికార్డులో నమోదు చేశారనని తమ పేర్లను తొలగించాలని అర్జీ పెట్టుకోవడంతోనే రికార్డులో పేరులు మార్చినట్లు తెలిపారు. బాధితుల నుంచి ఫిర్యాదు తీసుకొని సంబంధిత అధికారులపై చర్యలు తీసుకొని, బాధితులకు న్యాయం చేస్తానని, వారి పేరుపై మ్యూటేషన్ దరఖాస్తు చేశామని, మరో 15 రోజులో వారి పేరులు ఆన్‌లైన్‌లో నమోదు అవుతాయని తెలిపారు.

## యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న కర్నూలు బిషప్ గోరంట్ల జ్వానేష్ ఓసీడీ

**ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) :** యువత చెడు వ్యవసనాలకు దూరంగా ఉండి, సన్మార్గంలో నడవాలని కర్నూలుబిషప్ గోరంట్ల జ్వానేష్ అన్నారు. శనివారం ఆదోనిలోని ఆర్‌సీఎం చర్చిలో ఆయన మాట్లాడుతూ నేటి యువత చెడు వ్యసనాలకు బానిసలై విలువైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారన్నారు. ప్రజలను తల్లిదండ్రులను గౌరవించాలన్నారు. దైవభక్తి కలిగి సన్మార్గంలో నడవాలని సూచించారు. చదువులు మానేసిన యువతకు వృత్తి నైపుణ్యాలు ఉపాధి అవకాశాలపై వివరించారు. వివిధ గ్రామాలకు చెందిన 500మంది యువతకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆదోని ఆర్‌సీఎం చర్చ్ డీన్‌కోలా విజయరాజు, రాజేంద్ర, పాదర్ జాన్ డేవిడ్, పాదర్ చిన్నప్ప, పాదర్ జోసెఫ్, పాదర్ సురేష్, ఉపాధ్యాయులు ప్రభుదాస్, నవీన్ బాలరాజు చార్లెస్ పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

**ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) :** విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని రాయలసీమ ఇమిటేట్ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ ఆర్‌యూఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి షాహిద్ అఫ్రిది డిమాండ్ చేశారు. శనివారం ఆర్ట్స్ కళాశాల వద్ద విద్యార్థులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో కళాశాల యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలని వసూలు చేస్తున్నారన్నారు. చదువులు పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఫీజులు చెల్లించకపోవడంతో వారి సర్టిఫికెట్లు కూడా ఇవ్వడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు నరసింహ, సురేష్ పాల్గొన్నారు.

## ఎస్సీ కులం సర్వేపై ప్రత్యేక గ్రీవెన్స్

**పత్తికొండ టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి):** ఎస్సీ కులం సర్వేలో భాగంగా ప్రత్యేక గ్రీవెన్స్‌ను ప్రారంభించామని పత్తికొండ ఎంపీడీవో సువర్ణలత తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ సంబంధిత సచివాలయాల్లో ఎస్సీ కులానికి సంబంధించిన జాబితాను ఉంచామన్నారు. ఆయా గ్రామాల్లో ఉన్న ఎస్సీలు జాబితాలో తమ కులం సక్రమంగా ఉందా లేదా, ఏమైనా పొరపాట్లు ఉంటే సరిచేసుకునేందుకు ఈ నెల 31 వరకు అవకాశం ఉందన్నారు. ఆయా సచివాలయాల్లో తమకులానికి సంబంధించిన జాబితాలో సక్రమంగా ఉన్నాయా లేదా అని చూసుకుని సరి చేసుకోవాలని తెలిపారు.

## మహిళల సంక్షేమ కోసమే న్యాయ చట్టాలు

**హాలహర్వి, డిసెంబరు28 (ఆంధ్రజ్యోతి) :** మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి, సంక్షేమ కోసమే న్యాయ వ్యవస్థ అనేక చట్టాలు తీసుకురావడం జరిగిందని ఆలూరు ఇన్‌చార్జి న్యాయవాది జ్యోతి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మహిళల సమావేశంలో మాట్లాడారు. ప్రతి మహిళ అక్షరజ్ఞానం పెంచుకోవాలని, చట్టాలపై అవగాహన కల్పించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో వరలక్ష్మి, సీడీపీవో మద్దమ్మ, చందన, చంద్రవతి, ఎస్ఐ చంద్ర, వెలుగు ఏపీఎం శివయ్య పాల్గొన్నారు.

## ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు చివరి అవకాశం

**ఆదోని టౌన్, డిసెంబరు28 (ఆంధ్రజ్యోతి) :** ఎల్ఆర్ఎస్ (లేఔట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) గడువును వచ్చే ఎడాది మార్చి 31వరకు గడువు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. పట్టణ పరిధిలోని నాన్ లేఔట్‌లలోని ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకోవడం కోసం 2020లో ప్రభుత్వం ఈ స్కీమ్‌ను ప్రవేశ పెట్టింది. స్కీమ్ గడువు ముగిసేలోగా దరఖాస్తు చేసుకొని తగిన ఫీజులను చెల్లించి మంజూరు చేయించుకోవాలని దరఖాస్తుదారులకు ప్రభుత్వం మరొక అవకాశం కల్పిస్తూ గడువు పెంచింది. ఆదోని పట్టణ పరిధిలో మొత్తం 80మంది దరఖాస్తు చేసుకోగా, అందులో 68 మంజూరుకు కావాల్సి ఉంది. మంజూరు కానిదరఖాస్తులను గడువులోగా ఫీజులను చెల్లించి మంజూరు చేసుకోవాలని, లేనిపక్షంలో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు చర్యలు ఉంటాయని మునిసిపల్ ఏసీపీ కృష్ణ సింగ్ శనివారం తెలిపారు.

## సొసైటీల్లో ఖాతాదారులు ఈకేవైసీ తప్పనిసరి

**తుగ్గలి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) :** సొసైటీల్లో ఖాతాలున్న ప్రతి ఖాతాదారుడు, ఓటరు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని మారెళ్ల, ఉప్పర్లపల్లి సొసైటీల పర్సన్ చీఫ్ మేనేజర్లు అశోక్ కుమార్, సింగం శ్రీనివాసులు అన్నారు. శనివారం మండలంలోని జొన్నగిరి, పెండేకల్ ఆర్ఎస్ సొసైటీల్లో వారు మాట్లాడుతూ సొసైటీల్లో ఖాతాలున్న ప్రతి రైతు, ఓటర్లు వారి గ్రామాల్లోని సచివాలయాల్లో వారి అకౌంట్లను ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. అలాగే ఆ అకౌంటుకు సంబంధించిన జిరాక్స్ పేపరులన్నీ సొసైటీల్లో అందజేయాలన్నారు. అలా చేయకపోతే ప్రభుత్వం అందించే సున్నా వడ్డీ, సబ్సిడీ ఎరువులు, విత్తనాలు అందవన్నారు. ఓటు హక్కును కోల్పోతారన్నారు. కాబట్టి ప్రతి రైతు సచివాలయాలకు వెళ్లి ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమాల్లో సొసైటీ సీఈవోలు గిడ్డయ్య, మనోహర్ నాయుడు, సిబ్బంది మధు, నాగరాజు, రైతులు ఉన్నారు.

**మద్దికెర:** మండలంలోని బురుజుల సహకార సంఘంలో ఉన్న ఖాతాదారులు ఆయా సచివాలయాల్లో ఈకేవైసీ చేయించుకోవాలని పర్సన్ ఇన్‌చార్జి రామరాజు, సీఈవో మల్లికార్జున అన్నారు. శనివారం మండలంలోని బురుజుల గ్రామంలో కాతాదారుల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ ఖాతాదారులు ఈకేవైసీ చేయించుకుంటేనే ప్రభుత్వ రాయితీలు లభించడంతో పాటు ఓటు హక్కు ఉంటుందన్నారు. ప్రభుత్వం నుంచి సున్నా వడ్డీ రుణాలు, ఎరువుల కొనుగోళ్లు, పంట ఉత్పత్తులు అమ్ముకోవాలన్నా.. ఈకేవైసీ తప్పనిసరి అన్నారు. గ్రామ సచివాలయాల్లో వెల్ఫేర్ అసిస్టెంట్‌కు మీ వివరాలు అందజేసి ఓటీపీ ద్వారా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

## ఎస్సీ సర్టిఫికెట్లు ఇవ్వొద్దు



ఆలూరులో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న దళిత సంఘాల నాయకులు

**ఆలూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) :** మదాసీ కురువ, మాదారీ కురువ వర్గాలను ఎస్సీగా గుర్తించి సర్టిఫికెట్లు ఇవ్వవద్దని డిమాండ్ చేస్తు, దళిత సంఘాల శనివారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించాయి. ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల అధ్యక్షుడు మహానంది, పత్తికొండ డివిజన్ ఎమ్మార్పీఎస్ అక్కీనారాయణ, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు ఎల్లప్ప మాట్లాడుతూ, ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్న కురువలను ఎస్సీగా పరిగణించడం దళితుల హక్కులకు హానికరమని అన్నారు. తక్షణమే ఈ ప్రక్రియను నిలిపివేయాలని, అన్యాయంగా ఎస్సీ సర్టిఫికెట్లు పొందిన వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ విజయవాడకు వినతిపత్రం అందించారు.

## పేదలకు అండగా సీపీఐ నిరంతర పోరాటం



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య

**ఆలూరు, డిసెంబరు28 (ఆంధ్రజ్యోతి) :** ప్రజల హక్కుల కోసం సీపీఐ నిరంతర పోరాటం చేస్తోందని జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, కార్యవర్గ సభ్యుడు మద్దిలేటి శెట్టి అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ 1925 డిసెంబరు 26న కాన్పూర్‌లో స్థాపంచి నేటికి 100 సంవత్సరాల్లోకి అడుగు పెట్టింది. స్వతంత్ర ఉద్యమంలో కమ్యూనిస్టు పార్టీ ముఖ్యపాత్ర పోషించిందని గుర్తు చేశారు. నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సీపీఐ పోరాటాలు కొనసాగిస్తోందన్నారు. ఆ కార్యక్రమంలో సీపీఐ నాయకులు భూపేష్, రామాంజినేయులు. మారెప్ప, రంగన్న, తులసమ్మ, చాపల గోపాల్ పాల్గొన్నారు.

## ఏఐవైఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

**వెల్దుర్తి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి):** వెల్దుర్తి సీపీఐ కార్యాలయంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కారుమంచి ఆధ్వర్యంలో శనివారం ఏఐవైఎఫ్ సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అధ్యక్షులు ఆనంద్, ఉపాధ్యక్షులు శేషులతో కలిపి మొత్తం 11 మందితో ఏఐవైఎఫ్ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కృష్ణ పాల్గొన్నారు.

# భూ సమస్యలను వెంటనే పరిష్కరించండి: ఆర్డీవో



తహసీల్దార్లతో మాట్లాడుతున్న ఆర్డీవో భరత్‌నాయక్

**పత్తికొండ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి):** రెవెన్యూ సదస్సులలో భూ సమస్యలపై అందిన అర్జీలను త్వరగతిన పరిష్కరించాలని ఆర్డీవో భరత్‌నాయక్ అన్నారు. శనివారం కార్యాలయంలో డివిజన్ పరిధిలోని తహసీల్దార్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రెవెన్యూ సదస్సుల విజయవంతం కోసం కష్టపడినట్లే బాధితుల సమస్యల పరిష్కారంపై కూడా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

**తుగ్గలి :** జరిగిన రెవెన్యూ సదస్సులు ముగిసినట్లు తహసీల్దార్ రమాదేవి తెలిపారు. శనివారం మండలంలోని ఎద్దులదొడ్డిలో రెవెన్యూ సదస్సు నిర్వహించి రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 90 పైగా అర్జీలు వచ్చాయనీ, వాటిలో 30 దరఖాస్తుల సమస్యలను కూడా పరిష్కరించామన్నారు. మిగిలిన సమస్యలను కూడా రికార్డులను పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో డీటీ నాగరాజు, సర్వేయర్ సుధాకర్, సర్పంచ్ విజయుడు, శ్రీనివాసులుగౌడు, రవికుమార్, మల్లన్న, వీఆర్వోలు, తిమ్మప్ప నాగేంద్ర తదితరులు ఉన్నారు.

### ఎస్.పేరాములలో రెవెన్యూ సదస్సు


**వెల్దుర్తి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి):** మండలంలో ఎస్.పేరాముల గ్రామంలో తహసీల్దార్ చంద్రశేఖరవర్మ ఆధ్వర్యంలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రెవెన్యూ సదస్సుల ద్వారా రైతులు భూ సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్వేయర్ హేమంత్‌రెడ్డి, ఆర్ఐ ప్రసాద్, వీఆర్వో నాగన్న పాల్గొన్నారు.

**హొళగుంద :** హెన్నూరులో రెవెన్యూ సదస్సు నిర్వహించినట్లు తహసీల్దార్ సతీష్ శనివారం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నిర్వహించిన రీ-సర్వేలో భూ సమస్యలు తలెత్తడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదురుకొంటున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చినట్లు తెలిపారు. అందుకే రైతులను సమస్యలను వారి గ్రామాల్లోనే అధికారుల సమక్షంలో పరిష్కరించేందుకు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. రైతుల నుండి 10అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వో సూరంజినేయులు పాల్గొన్నారు.



## హిందూ సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

### పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు



మాట్లాడుతున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

**మంత్రాలయం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి):** భారతదేశ సనాతన సాంప్రదాయ హిందూ సంస్కృతికి, సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మంత్రాలయం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు అన్నారు. శనివారం బెంగళూరులోని పూర్ణప్రజ్ఞ విద్యాపీఠం మహాసభలో మంత్రాలయం పీఠాధిపతితో పాటు విశ్వప్రసన్నతీర్థులు, విశ్వేశ్వర తీర్థులు ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. సంస్కృత విద్య ఖండాంతర వ్యాప్తి చెందాలన్నారు. ప్రతి విద్యార్థి సంస్కృతంలో పీహెచ్‌డీ సాధించేందుకు విశేష కృషి చేస్తూ హిందూ సంస్కృతికి పాటు పడాలన్నారు. కంప్యూటర్ యుగంలో సంస్కృత విద్య వ్యాప్తికి కృషి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సమావేశంలో పండిత కేసరి విద్వాన్ రాజా ఎస్ గిరిరాజాచార్, ద్వారపాలక అనంతస్వామి, ప్రకాషాచార్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## సిబ్బందిపై డీఎల్‌పీవో ఆగ్రహం



సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీఎల్‌పీవో నూర్జహాన్

**పెద్దకడుబూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి):** పెద్దకడుబూరు ఎంపీడీవో కార్యాలయ సిబ్బందిపై డీఎల్‌పీవో నూర్జహాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఎంపీడీవో కార్యాలయానికి వచ్చిన ఆమె పరిసరాలను పరిశీలించారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యాలయ ఆవరణలో మల,మూత్ర విసర్జనలు చేస్తున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన అధికారులే ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎలా అని మండిపడ్డారు. గృహ యజమానులు వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేస్తామన్నారు. చెత్త సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని ఆమె అధికారులకు సూచించారు. ఆమె వెంట ఇన్‌చార్జి ఎంపీడీవో జయరాముడు, ఆదోని ఈవోపీఆర్డీ జనార్దన్, పంచాయతీ కార్యదర్శి శేషన్న, సర్పంచ్ రామాంజనేయులు పాల్గొన్నారు.

## వాహనాల తనిఖీ

**ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి):** ఎమ్మిగనూరు మండల పరిధిలోని ఎర్రకోట రహదారిలో రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు శనివారం ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు వాహనానికి సంబంధించిన రికార్డులను సక్రమంగా ఉంచుకోవాలన్నారు. రోడ్డు భద్రతా నియమాలను పాటించాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి వాహనాలను రికార్డులు లేకుండా నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ భీరప్ప, గూడుబాషా, ఫయాజ్‌బాషా, ప్రకాష్, వెంకటేశ్వరరెడ్డి, రమేష్ ఉన్నారు.

## పెద్దకడుబూరు ఎస్ఐని సస్పెండ్ చేయాలి

### కురువ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప



ఉరుకుందును పరామర్శిస్తున్న
కురువ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప

**ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) :** పెద్దకడుబూరు మండలం హెచ్ మురవణి గ్రామానికి చెందిన ఉబగడ్ల ఉరుకుందును విక్షచణారహితంగా కొట్టి గాయపరచిన ఎస్ఐ నిరంజన్ రెడ్డిపై విచారణ జరిపి వెంటనే సస్పెండ్ చేయాలని కురువ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఉబగడ్ల ఉరుకుందును శనివారం మాన్వి దేవేంద్రప్ప, కురువ సామాజిక వర్గానికి చెందిన పలువురు పరామర్శించారు. పొలం పంచాయితీ విషయంలో ఉరుకుందును శుక్రవారం విచారణ నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కొట్టారని ఆరోపించారు. ఈ ఘటనపై పోలీస్ అధికారులు విచారణ జరిపి ఎస్సై నిరంజన్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

# ట్రాఫిక్ అస్తవ్యస్తం

- ప్రధాన రహదారులపైనే వాహనాలు పార్కింగ్
- ఇబ్బంది పడుతున్న భక్తులు, గ్రామస్థులు

**మంత్రాలయం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి):** ప్రముఖ పుణ్యక్షేత్రం మంత్రాలయంలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. దీంతో భక్తులు, గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ఏడాది చివరి దినాలు వరసగా సెలవులు రావడంతో రాఘవేంద్ర స్వామి దర్శనార్థం భక్తులు పోటెత్తారు. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చారు. సొంత వాహనాల్లో వచ్చిన భక్తులు ముఖద్వారం, శ్రీమఠానికి వెళ్లే ప్రధాన రహదారి, రాఘవేంద్ర సర్కిల్, మాధవరం హైవే రోడ్డు, పోలీసు స్టేషన్ ఎదురుగా, నాగలదిన్నె రోడ్డు, బస్‌స్టాండ్ రోడ్డుకు ఇరువైపులా కి.మీ. మేర పార్కింగ్ చేయడంతో ఇబ్బందులు



శ్రీమఠానికి వెళ్లే రోడ్‌లో నిలిచిన వాహనాలు

తలెత్తాయి. దీనికి తోడు ఆటోలు ఇష్టారాజ్యంగా తిప్పడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పట్టించుకోవాల్సిన పోలీసులు తూతూ మంత్రంగా వ్యవహరిస్తుండడంపై వివిధ రాష్ట్రాల భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శ్రీ మఠానికి వెళ్లే ప్రధాన రహదారులు, ముఖద్వారం వద్దకు ఆటోలకు అనుమతిలేకపోయిన ఎక్కడపడితే అక్కడ నిలిపి భక్తులను ఎక్కించుకోవడం, అడ్డె మాట్లాడుకోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కల్పిస్తున్నారు. లాడ్జీలు, హోటళ్ల యజమానులు పార్కింగ్‌కు స్థలాలు లేకపోవడం ప్రధాన రహదారులకు ఇరువైపుల పార్కింగ్ చేయించడంపై భక్తులు మండి పడుతున్నారు. పోలీసు అధికారులు ట్రాఫిక్ వ్యవస్థను చక్కదిద్ది, ఆటోలను నియంత్రించి ట్రాఫిక్ నివారణకు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.



మహాముఖ ద్వారం వద్ద అడ్డదిడ్డంగా తిరుగుతున్న వాహనాలు

## రేషన్ పంపిణీలో అవకతవకలు

- విజిలెన్స్ తనిఖీల్లో వెలుగులోకి..
- ఆదోని సబ్ కలెక్టర్ ఎదుట హాజరైన ఆరుగురు డీలర్లు

**ఎమ్మిగనూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి):** ఎమ్మిగనూరు పట్టణంలో కొంతమంది డీలర్లు నిత్యావసర సరుకుల పంపిణీలో అవకతవకలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో సదరు డీలర్లపై విజిలెన్స్ అధికారులు దృష్టి సారించారు. ఈనెల రేషన్ పంపిణీ సమయంలో ఆకస్మికంగా రేషన్ దుకాణాలను తనిఖీలు చేపట్టారు. ఇలా మూడు రోజుల పాటు పట్టణంలోని ఆయా ప్రాంతాల్లో ఉన్న రేషన్ దుకాణాలను తనిఖీలు నిర్వహించారు. ఇందులో ఐదుగురు రేషన్ డీలర్లతో పాటు ఓ ఇన్‌చార్జి డీలరు దుకాణాల్లో రేషన్ పంపిణీలో అవకతవకలు జరిగినట్లు రికార్డుల్లో బయటపడింది. కొంతమంది డీలర్ల దగ్గర బియ్యం తక్కువగా ఉండటం, మరి కొంతమంది దగ్గర చెక్కెర, బియ్యం నిల్వల్లో తేడాలు ఉండటాన్ని విజిలెన్స్ అధికారులు గుర్తించారు. దీంతో అవకతవకలు జరుగుతున్నట్లు గుర్తించిన విజిలెన్స్ అధికారులు వెంటనే సదరు ఆరుగురు డీలర్లపై కేసు నమోదు చేసి వివరాలను ఆదోని సబ్ కలెక్టర్‌కు పంపారు. ఇందుకు స్పందించిన సబ్ కలెక్టర్ ఈ నెల 28న ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయానికి హాజరై సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు. దీంతో శనివారం సదరు ఆరుగురు డీలర్లు సబ్ కలెక్టర్ ఎదుట హాజరై సంజాయిషీ ఇచ్చినట్లు తెలిసింది. అయితే రేషన్ డీలర్లపై సబ్ కలెక్టర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనని రేషన్ డీలర్లు బిక్కుబిక్కుమంటున్నారు. రేషన్ డీలర్లపై నిత్యం పర్యవేక్షణ లేకపోవటం వల్లే అక్రమాలు చోటు చేసుకుంటున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

## ఈకేవైసీ చేయించుకోవాలి: సీఈవో

**నందవరం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి):** నందవరం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలోని ఖాతాదారులు గ్రామ సచివాలయాల్లో ఈకేవైసీ చేయించుకోవాలని సీఈవో బాణాల సుదర్శనం, ప్రత్యేక అధికారి శ్రీనివాసులు తెలిపారు. శనివారం సహకార సొసైటీలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈకేవైసీ చేయించుకుంటే ప్రభుత్వం నుంచి వచ్చే సున్నవడ్డీ, సబ్సిడీలు వర్తిస్తాయన్నారు. గోపాలురావు, ప్రతాప్, వీరేష, రైతులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యం



అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న
టీడీపీ రాష్ట్ర రైతు సంఘం అధికార ప్రతినిధి రమాకాంత్‌రెడ్డి

**పెద్దకడుబూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి):** విద్యార్థులకు విజ్ఞానంతో పాటు నాణ్యమైన విద్యనందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ రాష్ట్ర రైతు సంఘం అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి అన్నారు. శనివారం పెద్దకడుబూరులోని జడ్పీహెచ్ స్కూల్‌లోని ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ రైసింగ్ నిధుల కింద రూ. 65లక్షల వ్యయంతో నిర్మిస్తున్న ల్యాబ్‌రోటరి, లైబ్రేరీ, ఆటస్థల సామగ్రి బిల్డింగ్‌కు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా రమాకాంత్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ ప్రయోజకులుగా తీర్చిదిద్దేందుకు విద్యాశాఖకు కూటమి ప్రభుత్వం భారీ మొత్తంలో నిధులు విడుదల చేసిందన్నారు. విద్యార్థులు ప్రభుత్వం అందించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఉమా రాజేశ్వరమ్మ, టీడీపీ నాయకులు మల్లికార్జున, మీసేవ ఆంజినేయులు, స్వామి రాజు, బొగ్గుల నరసన్న, బొగ్గుల తిక్కన్న, గుమ్మల ఆశన్న, ఆదాము, ఇమ్మానియేల్, బుడ్డన్న, దేవసహాయం, సుధాకర్, సందీప్ పాల్గొన్నారు.

## ఎస్సీ కులగణనలో తప్పులు చేస్తే ఒప్పుకోం

**మంత్రాలయం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి):** ఎస్సీ కులగణన నివేదికల్లో తప్పులుగా నమోదు చేస్తే అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని జైభీమ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చిక్కింజానయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ రాష్ట్ర సచివాలయాల్లో ఎస్సీ కులగణన నివేదికలు తప్పులుగా ఉన్నట్లు ఆధారాలు ఉన్నాయని అన్నారు. అయా గ్రామాల్లో సచివాలయాల వద్దకు వెళ్లి అనేక మంది కురువ, మాదాసి కురువలు ఎస్సీలుగా అక్రమ సర్టిఫికెట్లు పొందారని ఆరోపించారు. మాదాసి కురువలు లేరని తక్షణమే వాటిని రద్దు చేసి మాలమాదిగలకు న్యాయం చేయాలని కోరారు. తప్పుడు కులగణనలు చేస్తే సంబంధిత అధికారులపై ఆయా పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేయిస్తామన్నారు.

## గంగవరంలో పైపులైన్ పనులు




తాగునీటి కోసం పైపులైన్ వేస్తున్న అధికారులు

**నందవరం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి):** మండల పరిధిలోని గంగవరం గ్రామంలో తాగునీటి ఎద్దడి నివారణకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మూర్తి ఆధ్వర్యంలో శనివారం పైపులైన్ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా రిలయన్స్ ఫౌండేషన్ ఆర్డీఫ్‌సంస్థ కార్యకర్త ఉసేని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వచ్ఛమైన నీరు తాగాలన్నారు. తద్వారా ఆరోగ్యంగా ఉంటామన్నారు. గ్రామంలో తాగునీటి ఎద్దడి నివారణకు సహకరించిన ఫౌండేషన్‌కు సర్పంచ్ శివన్న కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పెద్దిరెడ్డి, రాముడు, కరుణప్ప పాల్గొన్నారు.

# మంత్రాలయంలో భక్తుల సందడి

**మంత్రాలయం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి):** రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో మంత్రాలయం సందడిగా మారింది. ఏడాది ఆఖరి శని, ఆదివారాలు కావటంతో దక్షణాది రాష్ట్రాలైన ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, నదితీరం భక్తులతో కోలాహలంగా మారింది. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. క్యూలైన్లు, పరిమళప్రసాదం వద్ద భక్తుల సందడిగా మారింది. రథోత్సవాల ఊరేగింపులో పాల్గొని భక్తులు పండితుల ఆశీస్సులు పొందారు.

**అన్నదానానికి విరాళం:** రాఘవేంద్రస్వామి మఠంలోని నిత్యాన్నదానానికి బెంగుళూరుకు చెందిన అచ్యుత్‌రావు అనేభక్తుడు రూ.3లక్షలు, గోశాలకు రూ.2 లక్షలు , విద్యాదానానికి రూ.20 వేలు , అల్వేలు అనేభక్తుడు అన్నదానానికి రూ.50 వేలు విరాళంగా ఇచ్చినట్లు ఏఏవో మాధవశెట్టి, మేనేజరు వెంకటేష్ జోషి తెలిపారు. శనివారం వేర్వేరు



భక్తులతో కిటకిటలాడుతున్న మఠం ప్రాంగణం

సమయాల్లో కుటుంబ సమేతంగా వారు రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. విరాళం ఇచ్చిన దాతల కుటుంబాలకు పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆశీర్వదించారు. కార్యక్రమంలో శ్రీపాద ఆచార్, గిరిధర్, అనంతపురాణిక్ తదితరులు పాల్గొన్నారు.

## పవర్ లిఫ్టింగ్‌లో కాంస్య పతకం



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

**ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఎమ్మిగనూరుకు చెందిన విద్యార్థి కె.ఎండి.వలి కాంస్య పతకం సాధించారు. శనివారం శ్రీ నీలకంఠేశ్వర జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ప్రధానోపాధ్యాయురాలు కే శోభ మాట్లాడుతూ ఈ నెల 21,22 తేదీల్లో విజయవాడ, కృష్ణలంకలో జరిగిన అండర్-17 పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి కె.ఎండి.వలి 74 కేజీల విభాగంలో సత్తాచాటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో పీడీ ఎండీ అస్లాం, ఉపాధ్యాయులు హరికృష్ణ, మోహన్, రామాంజనేయులు పాల్గొన్నారు.

## టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి



భూమి పూజ చేస్తున్న టీడీపీ నాయకులు

**గోనెగండ్ల, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి):** టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని టీడీపీ మండల కన్వీనర్ నజీర్ అన్నారు. శనివారం చిన్నమరివీడు గ్రామంలో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సీసీ రోడ్డు వేయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బేతాల బడేసా, శ్రీనివాసులు, షేక్షావలి, రమేష్‌నాయుడు, ఉసేన్, తిమ్మారెడ్డి, రాజేష్, పెద్దయ్య, టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీజేపీ మండల అధ్యక్షుడిగా మునిస్వామి గౌడ్

**గోనెగండ్ల, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి):** బీజేపీ మండల నూతన అధ్యక్షుడిగా గోనెగండ్లకు చెందిన మునిస్వామి గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బీజేపీ ఎన్నికల ముఖ్యనాయకుడు దేశాయి చంద్రన్న తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని వీరభద్రస్వామి దేవాలయంలో బీజేపీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండలస్థాయి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మునిస్వామి గౌడ్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయడం కోసం బూత్ కమిటీలను ఏర్పాటు చేసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీపీఎం మహాసభలను జయప్రదం చేయండి

**గోనెగండ్ల, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి):** ఎమ్మిగనూరు పట్టణంలో ఆదివారం నిర్వహిస్తున్న 23వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా నాయకులు అబ్దుల్లా, నరసింహుడు, ప్రజానాట్యమండలి నాయకులు సుంకన్న, బతకన్న, బాలు, లక్ష్మన్న పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని గోనెగండ్ల, అగ్రహారం, బైలుప్పల, గంజహళ్లి, చిన్నమరివీడు, పెద్దమరివీడు, అలువాల, హెచ్ కైరవాడి గ్రామాలలో ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో జీపు జాత నిర్వహించారు.



మాట్లాడుతున్న అబ్దుల్లా

## వైపీసీ ధర్నా చేయడం సిగ్గు చేటు

### టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి



మాట్లాడుతున్న రాఘవేంద్రరెడ్డి

**మంత్రాలయం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి):** ఐదేళ్ల వైఎస్ జగన్ పాలనలో విద్యుత్ చార్జీలను పదిసార్లుకు పైగా పెంచి.. పార్టీ మనుగడ కోసం మళ్లీ వారే ధర్నాలు చేయడం సిగ్గు చేటు అని మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి విమర్శించారు. శనివారం ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను తప్పక నెరవేరుస్తుందన్నారు. ఐదేళ్లలో జగన్ అనాలోచిత నిర్ణయాలు, విద్యుత్ ఒప్పందాల వల్ల పేద ప్రజల నెత్తిన విద్యుత్ బకాయిలు మోపిందని అన్నారు. జగన్ రెడ్డి చెప్పే అబద్దాలు ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలల్లోనే పించన్ల పెంపు, గ్యాస్, సీసీ రోడ్లు, ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు, మెగా డీఎస్సీ నోటిఫికేషన్ వంటివి చేపట్టారన్నారు. సమావేశంలో నాయకులు రఘునాథరెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## బాధితుడికి పరామర్శ



శ్రీనివాసులను పరామర్శిస్తున్న మాజీ ఎంపీ బుట్టా రేణుకా

**నందవరం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి):** అనారోగ్యంతో బాధపడుతున్న హాలహర్వికి చెందిన శ్రీనివాసులను మాజీ ఎంపీ, వైసీపీ ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జి బుట్టా రేణుకా, బుట్టా నీలకంఠ పరామర్శించారు. శనివారం ఆస్పత్రికి వెళ్లి ఆరోగ్య విషయాలను బంధువులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని కోరారు. ఈమె వెంట ఎల్లెల్సీ మాజీ డైరెక్టర్ గడ్డం నారాయణరెడ్డి, ముగతి సర్పంచ్ విరుపాక్షిరెడ్డి, బజారి, శాంతిరాజు, ప్రతాప్ పాల్గొన్నారు.

## పాఠశాల సమీపంలో దుర్గంధం



చదువుల రామయ్య కాలనీ
ప్రాథమిక పాఠశాల దగ్గర పారుతున్న మురుగు

**గోనెగండ్ల, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి):** మండల కేంద్రంలోని చదువురామయ్య కాలనీ ప్రాథమిక పాఠశాల దగ్గర మురుగునీరు పారుతుంది. దీంతో పాఠశాల విద్యార్థులు దుర్గంధంతో ఇబ్బంది పడుతున్నారు. అలాగే మురుగునీటిలో పిల్లలు కాలుజారి కిందపడి దెబ్బలు తగిలించుకున్న సందర్భాలు ఉన్నాయి. పాఠశాల పరిసరాలలో సీసీ రోడ్డు, డ్రైనేజీ లేని కారణంగా చుట్టుపక్క గృహాల నుంచి మురుగునీరు రోడ్లుపైకి వస్తోంది. ఆ నీరు అంతా పాఠశాల ఆరుబయట నిలిచిపోతుంది. దీంతో పాఠశాల ప్రాంతం అంతా బురద మయం కావడంతో చిన్నపిల్లలు పాఠశాలకు రావడానికి ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

# పెండింగ్ భూ సమస్యలు పరిష్కరించాలి

**పెద్దకడుబూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి):** పెండింగ్ భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం నాయకులు తిక్కన్న, శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శనివారం మండల పరిధిలోని కల్లుకుంట గ్రామంలో నిర్వహిస్తున్న గ్రామ సభలో తహసీల్దార్ శ్రీనాథ్‌కు సీపీఎం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాగు చేసుకున్న రైతులకు పట్టాలు ఇవ్వాలన్నారు. జాయింట్ ఎల్‌పీఎంలను సర్వే చేసి ప్రతి రైతుకు ఎల్‌పీఎం నెంబర్లు ఇవ్వాలన్నారు. రీసర్వేలో కొలతలు పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే రైతులకు సర్వే చేసి హద్దులు చూపించాలన్నారు. దేవదాయ భూములను సాగు చేసుకున్న రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బుడ్డన్న, టిప్పు సుల్తాన్ పాల్గొన్నారు.



చిలకలడోనలో రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్ రవి

**ఎమ్మిగనూరు రూరల్:** మండల పరిధిలోని పార్లపల్లి గ్రామంలో తహసీల్దార్ శేషఫణి అధ్యక్షతన రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రైతులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. 40 రోజుల్లోపు సమస్యలను పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో సర్వేయర్ వాహిద్, ఆర్ఐ లక్ష్మన్న, వీఆర్వో సుధారాణి, గ్రామ టీడీపీ నాయకులు మల్లికార్జున, చంద్రశేఖరరెడ్డి, భీమరాయుడు, చంద్రశేఖర్, విశ్వనాథ్, రాజేష్, బోయ చంద్ర, బడేసాహెబ్, వీరేష్ పాల్గొన్నారు.




గోనెగండ్లలో ప్రజలతో మాట్లాడుతున్న తహసీల్దార్

**గోనెగండ్ల:** రీ సర్వేలలో జరిగి పొరపాట్లను సరిచేసేందుకు రైతుల భూసమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తహసీల్దార్ కుమారస్వామి అన్నారు. శనివారం మండల మండల పరిధిలోని తిప్పనూరు గ్రామంలో భూ సర్వే గ్రామ సభ నిర్వహించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

**మంత్రాలయం:** మండలంలోని చిలకలడోన గ్రామంలో వీఆర్వో ప్రభాకర్ అధ్యక్షతన రెవెన్యూ సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవి, సర్వేయర్ అశోక్, ఆర్ఐ ఆదాం, వీఆర్వోలు ఆనంద్, నరసప్పలు పాల్గొన్నారు.